జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | సోమవారం 30 డిసెంబర్ 2024 | సంపుటి : 15 | సంచిక : 278 | వెల: రూ.5 | పేజీలు: 08

RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528



# ఏపీలో కేబినెట్ విస్తరణ?

- జనవరి ఎనిమిదో తేదీన ఈ విస్తరణ ఉండే అవకాశాలు
- నాగబాబును కేబినెట్ లోకి చేర్చుకోవడం కూడా ఆరోజే జరుగుతుంది
- ఐదు నెలల తర్వాత ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ పోస్టుల్లో ఒకటి నాగబాబుకు ఇవ్వడం కూడా దాదాపుగా ఖాయమైంది
- ప్రస్తుతం కేబినెట్ లో 25 మంది ఉన్నప్పటికీ నలుగురైదుగురు ప్రస్తుత మంత్రి వర్గ సభ్యుల విషయంలో చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తుంది.

**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ లో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్న ప్రచారం జరుగుతుంది. జనవరి ఎనిమిదో తేదీన ఈ విస్తరణ ఉండే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల్లో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. ప్రస్తుతం ఉన్న కేబినెట్ నుంచి కొందరిని తప్పించి మరికొందరికి అవకాశం కల్పించడమే కాకుండా జనసేన నేత నాగబాబును కేబినెట్ లోకి చేర్చుకోవడం కూడా ఆరోజే జరుగుతుందని చెబుతున్నారు. నాగబాబుకు మంత్రి పదవి గ్యారంటీ అయింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే స్పష్టం చేశారు. ఐదు నెలల తర్వాత ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ పోస్టుల్లో ఒకటి నాగబాబుకు ఇవ్వడం కూడా దాదాపుగా ఖాయమైంది. అయితే నాగబాబు కేబినెట్ లో చేరిక వార్త చంద్రబాబు చెప్పి పక్షం రోజులు దాటుతున్నా ఇంకా ఆయన కేబినెట్ లో చేరలేదు.నాగబాబుతో పాటు మరికొందరిని మంత్రివర్గంలోకి చేర్చుకోవాలని చంద్రబాబు భావిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం కేబినెట్ లో 25 మంది ఉన్నప్పటికీ నలుగురైదుగురు ప్రస్తుత మంత్రి వర్గ సభ్యుల విషయంలో చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. వారి పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలను తెప్పించకుంటూ వారికి మార్కులను కూడా చంద్రబాబు కేటాయిస్తున్నారు. అట్టడుగున ఉన్న నలుగురిని మంత్రివర్గం నుంచి తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్న యోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నట్లు తెలిసింది. మంచి మార్కులు పొందిన వారిలో పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, నారా లోకేష్, అనిత, నారాయణ, గొట్టిపాటి రవికుమార్ వంటి వారు ఉన్నారు. అయితే మిగిలిన వారిలో మరీ వీక్ గా నలుగురు ఉన్నట్లు చెబుతున్నారు.2024లో కూటమి ప్రభుత్వం గెలిచిన తర్వాత చంద్రబాబు ఈసారి సీనియర్ నేతలను పక్కన పెట్టారు. తొలిసారి గెలిచినా వారికి మంత్రి పదవులను కట్టబెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చంద్రబాబు తన మంత్రి వర్గంలో తొలి సారి గెలిచిన వారికి మంత్రిపదవులు ఇవ్వడం - మిగతా3లో

# నేతలు... కాదు కేడర్ పైనే

- పవన్ కల్యాణ్ తన లెక్కలు కరెక్ట్ గానే ఉన్నాయంటున్నారు
- ఆయన తన అంచనాలు ఎప్పుడూ తప్పవన్న అభిప్రాయంలో ఉన్నట్లుంది.
- నాయకుల మీద కాకుండా కేవలం జనం మీదనే ఆధారపడి పార్టీ విజయం సాధిస్తుందన్న బలమైన నమ్మకంతో పవన్ కల్యాణ్ ఉన్నట్లు కనిపిస్తుంది.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది అవుతున్నప్పటికీ పవన్ కల్యాణ్ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై పెద్దగా ఫోకస్ పెట్టలేదు.



**అమరావతి**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన లెక్కలు కరెక్ట్ గానే ఉన్నాయంటున్నారు. ఆయన తన అంచనాలు ఎప్పుడూ తప్పవన్న అభిప్రాయంలో ఉన్నట్లుంది. అందుకే పార్టీ బలోపేతానికి పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నాయకుల మీద కాకుండా కేవలం జనం మీదనే ఆధారపడి పార్టీ విజయం సాధిస్తుందన్న బలమైన నమ్మకంతో పవన్ కల్యాణ్ ఉన్నట్లు కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది - మిగతా3లో



## నేడు పీఎస్ఎల్వీ సీ 60 రాకెట్ ప్రయోగం

- మరి కొద్ది గంటల్లో కౌంట్‌డౌన్ ప్రారంభం
- నింగికేగనున్న పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ 320 టన్నుల బరువు
- 44.5 మీటర్ల ఎత్తు
- పీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 62వ ప్రయోగం కాగా పీఎస్ఎల్వీ కోర్ అలోన్ దశతో చేసే 18వ ప్రయోగమిది.
- ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, వీటిని ఛేజర్, టార్గెట్ అనే పేర్లను నామకరణం

## పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు.. రంగంలోకి అధికారులు

- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు కీలక ఆదేశాలు జారీ
- చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు
- గత కొన్ని రోజులుగా సంస్థ నుంచి ఘాటైన, దుర్గంధపూరిత వాయువులు విడుదల విషయంపై పవన్ కల్యాణ్ ఆరా
- ప్రజలకు వాయు కాలుష్య సమస్యలు లేకుండా చూడాలని స్పష్టం

**అమరావతి**

కాకినాడ తీర ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతున్న పరిశ్రమలో తనిఖీలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కాకినాడలోని యూనివర్సల్ బయోఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వ్యవహారంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. కాకినాడ వాకలపూడి ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న యూనివర్సల్ బయోఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నుంచి కాలుష్యకారక దుర్గంధం వెదజల్లుతోందని అన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత కొన్ని రోజులుగా సంస్థ నుంచి ఘాటైన, దుర్గంధపూరిత వాయువులు విడుదల విషయంపై పవన్ కల్యాణ్ ఆరా తీశారు. పొల్యూషన్ - మిగతా3లో





## మహా కుంభమేళాకు ముస్తాబవుతున్న అయోధ్య

- అప్పుడే హొటళ్లు ఫుల్!
- బాల రాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశాలు
- నూతన ఏడాది, మహా కుంభమేళా పురస్కరించుకొని అయోధ్య నగరం అందంగా ముస్తాబవుతోంది.
- రామమందిర ప్రారంభోత్సవం తర్వాత తొలిసారి కుంభమేళా జరుగుతుండడం వల్ల అయోధ్యలోనూ ముమ్మరంగా ఏర్పాట్లు

## కెమికల్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్

- విషవాయువు పీల్చి నలుగురు మృతి..
- దహేజ్‌లో ఓ రసాయన కర్మాగారంలో విష వాయువు లీకేజీ
- గుజరాత్ ఫ్లూరో కెమికల్స్ ఫ్యాక్టరీ ప్రొడక్షన్ యూనిట్ లో ఈ ప్రమాదం

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీలు ఖరారు..
# ఆ పార్టీల మధ్యనే పోటీ..



గత అసెంబ్లీ ఎన్నికల(2020) సమయంలో జనవరి 14న నోటిఫికేషన్ జారీ అవ్వగా, ఫిబ్రవరి 8న పోలింగ్ జరిగింది. ఫిబ్రవరి 11న ఓట్ల లెక్కింపు జరిగింది. ఈసారి కూడా కాస్త అటూఇటుగా తేదీలు ఖరారయ్యే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల నిర్వహణలో విద్యాశాఖ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. కాబట్టి ఈ ఏడాది జరగబోయే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పరీక్షల తేదీలతో ఎన్నికల తేదీలకు ఇబ్బంది కలుగకుండా కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది.

**ముక్కోణపు పోరులో లాభపడేదెవ్వరు?**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గత రెండు పర్యాయాలు పోటీ ప్రధానంగా ఆమ్ ఆద్మీ పార్టీ భారతీయ జనతా పార్టీ మధ్యనే పోటీ నెలకొనగా.. ఈసారి కాంగ్రెస్ తన పూర్వవైభవం చాటుకోవాలని చూస్తోంది. ఆప్ కంటే ముందు సుదీర్ఘకాలం పాటు దేశ రాజధానిలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ, ఆ తర్వాత డిపాజిట్లు సైతం దక్కించుకోలేని స్థితికి చేరుకుంది. ఆ పార్టీ ఓటు బ్యాంకు దాదాపుగా ఆప్ హస్తగతం చేసుకుంది. దాంతో కాంగ్రెస్ ఓటు బ్యాంకు 10 శాతానికి పడిపోయింది. కొద్ది నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి శత్రువు బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు కలసికట్టుగా పోటీ చేసినా ఫలితం లేకపోయింది. ఢిల్లీ ఓటర్లు అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు వేర్వేరు తీర్పులు ఇస్తున్నారు. జాతీయస్థాయిలో బీజేపీ నేతృత్వంలోని సుస్థిర ప్రభుత్వానికి మొగ్గుచూపుతూ వచ్చారు. అందుకే ఈ రెండు పార్టీలు కలిసినా సరే.. 7 సీట్లలో ఒక్కటి కూడా కైవసం చేసుకోలేకపోయింది. కానీ అసెంబ్లీ ఎన్నికల విషయానికి వచ్చేసరికి మాత్రం ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించి అమలు చేస్తున్న ఉచితాలు, ప్రజాకర్షక పథకాలు వరుసగా ఆయన్ను గెలిపిస్తూ వచ్చాయి. రాజధానిలో ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థలను మెరుగుపరిచి మార్కులు సాధించడం కూడా కేజ్రీవాల్‌కు కలిసొచ్చిన అంశాలయ్యాయి. దళిత, మైనారిటీ వర్గాల్లో కోల్పోయిన పట్టును మళ్లీ సాధిస్తూ తమ ఓటుబ్యాంకును మెరుగుపరుచుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, ఈ సారి ఎలాగైనా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉంది. ఇప్పటికే పొరుగునే ఉన్న హర్యానాలో గెలుపు వాకిట తడబడి ఓడిన కాంగ్రెస్ పార్టీ, ఢిల్లీ విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఆప్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ సాధించిన 53.57 శాతం ఓట్లు సాధించి 70 అసెంబ్లీ స్థానాల్లో 62 గెలుపొందగా, 38.51 శాతం ఓట్లు సాధించిన బీజేపీ 8 సీట్లలో విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 4.26 శాతానికే పరిమితమైంది. పదేళ్ల పాలనపై సహజంగా ఏర్పడే వ్యతిరేకతకు తోడు ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం, శీష్ మహల్‌గా పేరొందిన విలాస నివాస భవనం సహా 2020 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అమలు చేయలేకపోవడం వంటివి కేజ్రీవాల్‌కు ప్రతికూలాంశాలుగా మారాయి. ఈ ప్రతికూలతలు కేజ్రీవాల్ గతంలో సాధించిన 53 శాతం ఓట్లలో కోత విధిస్తాయని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. అయితే అవి ఎటువైపు మళ్లుతాయి అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న. ఒకవేళ నేరుగా బీజేపీకి బదిలీ అయితే ఆ పార్టీ విశేషంగా లాభపడుతుంది. అలాకాకుండా కాంగ్రెస్ వైపు మళ్లినా సరే.. పరోక్షంగా బీజేపీకే వరంగా మారుతుంది. తాజా లోక్‌సభ ఎన్నికల తర్వాత ముస్లిం మైనారిటీలు, దళిత ఓట్లలో మళ్లీ కొంతమేర పట్టు సాధించిన కాంగ్రెస్ పార్టీ, ఈ వర్గాలను కేజ్రీవాల్‌కు దూరం చేసినా సరే.. కమలదళానికే ఉపయోగం ఎక్కువ. కాంగ్రెస్ పెంచుకునే ఓట్లశాతం ఆ పార్టీని గెలిపించకపోయినా.. దశాబ్దకాలం తర్వాత ఖాతా తెరిచేందుకు ఉపయోగపడుతుంది. అదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీని బలహీనపరిచి, బీజేపీకి పరోక్ష ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. మరోవైపు అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పురుడుపోసుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఇతర రాజకీయ పార్టీలకు భిన్నమేమీ కాదని, అనేక రకాల అవినీతి, అక్రమాలకు తెరలేపిందని కమలదళం ప్రజాకోర్టులో బురదజల్లింది. ఇది తనపై సాగుతున్న కక్షసాధింపు రాజకీయమని, ప్రజాకోర్టులోనే తీర్పు అడుగుతానని సీఎం పదవిని వదులుకుని ఎన్నికల ప్రచారం చేపట్టిన కేజ్రీవాల్, కేసులు, అరెస్టు, జైలుపాలవడాన్ని సానుభూతి పవనాలుగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల్లో సాధించిన ఓట్లశాతాన్ని సమీప ప్రత్యర్థి బీజేపీతో పోల్చుకుంటే 15 శాతం తేడా ఉంది. ఇందులో ప్రతికూలతల కారణంగా కొంత మేర ఓట్లు తగ్గినా.. ఈ భారీ వ్యత్యాసాన్ని పూడ్చలేవని, సీట్లు కొన్ని తగ్గినా విజయం తమదేనన్న ధీమాలో ఆమ్ ఆద్మీ పార్టీ ఉంది.

## నేడు పీఎస్ఎల్వీ సీ 60 రాకెట్ ప్రయోగం..



**అమరావతి :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో ప్రయోగానికి సిద్ధమయ్యింది. సోమవారం ప్రయోగించనున్న పీఎస్ఎల్వీ సీ 60 రాకెట్‌కు మరికొద్ది గంటల్లో కౌంట్‌డౌన్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సూళ్లురుపేట షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి సోమవారం రాత్రి 9.58 గంటలకు రాకెట్‌ను నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ రాకెట్ ప్రయోగానికి ఈరోజు రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభానికి ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ రాత్రి బెంగళూరు నుంచి షార్‌కు చేరుకోనున్నారు. పీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 62వ ప్రయోగం కాగా పీఎస్ఎల్వీ కోర్ అలోన్ దశతో చేసే 18వ ప్రయోగమిది. రేపు నింగికేగనున్న పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ 320 టన్నుల బరువు, 44.5 మీటర్ల ఎత్తు ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. స్ట్రాపాన్ బూస్టర్లను ఉపయోగించకపోవడంతో ఈ రాకెట్ బరువు 229 టన్నులుగా ఉంటుందని వివరించారు. రాకెట్‌లో రెండో దశకు ద్రవ ఇంధనం, మూడో దశకు ఘన ఇంధనం, నాలుగో దశకు ద్రవ ఇంధనాన్ని వినియోగించనున్నట్లు వివరించారు. ఇస్రో రూపొందించిన స్పాడెక్స్ అనే జంట ఉపగ్రహాలు ఈ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, వీటిని ఛేజర్, టార్గెట్ అనే పేర్లను నామకరణం చేశామన్నారు. ఈ ఉపగ్రహాలు స్పేస్ డాకింగ్, ఫార్మేషన్ ఫ్లయింగ్, మానవ అంతరిక్షయానం వంటి సేవలకు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు.

## కెమికల్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్




గుజరాత్‌లోని భరూచ్ జిల్లాలో విషాద సంఘటన చోటు చేసుకుంది. దహేజ్‌లో ఓ రసాయన కర్మాగారంలో విష వాయువు లీకేజీ కారణంగా నలుగురు కార్మికులు మృతిచెందారు. దహేజ్ ప్రాంతంలోని గుజరాత్ ఫ్లూరో కెమికల్స్ ఫ్యాక్టరీ ప్రొడక్షన్ యూనిట్ లో ఈ ప్రమాదం జరిగింది. వాయువులు వెళ్లే ఒక పైప్‌లైన్‌కు రంధ్రం పడటంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు నిపుణులు గుర్తించారు. వాయువును పీల్చిన వెంటనే నలుగురు కార్మికులు స్పృహ కోల్పోయారు. వారిని గుర్తించిన ఇతర సిబ్బంది.. ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తర్వాత కొద్ది సేపటికే నలుగురు చనిపోయారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుగుతోంది.. ఈ మేరకు దహేజ్ పోలీస్ స్టేషన్ అధికారి మాట్లాడుతూ..కార్మికులను భరూచ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. నాలుగో కూలీ ఉదయం 6 గంటలకు మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ లిమిటెడ్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ ఘటనపై స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కంపెనీ నిర్లక్ష్యానికి కారణమని ప్రజలు ఆరోపిస్తూ, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కండోమ్ లో పెట్రోల్ పోసి....

**ముంబై :** రాజకీయ నాయకులపై, సినిమా వాళ్లపై... శత్రువులపై ఒక్కొక్కరూ ఒక్కోలా దాడి చేస్తారు. కర్రలు, రాళ్లతో కొట్టడం, గుడ్లు, టమోటాలు విసరడం.. మరీ కోపం ఎక్కువైతే కత్తులతో నరకడం, ఉరివేసి చంపడం, బాంబులు విసరడం ఇలా ఎన్నో రకాలుగా చేస్తుంటారు పలువురు నిందితులు. కానీ మనం ఇప్పుడు మాట్లాడుకోబోయే దాడి మాత్రం అంతకు మించింది. ఓ గ్రామ సర్పంచ్‌పై పగ పట్టిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు కండోమ్‌తో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సర్పంచ్ తీవ్రంగా గాయపడ్డాడు. కండోమ్ దాడి ఏంటబ్బా అనుకుంటున్నారా ఈ స్టోరీ మొత్తం చదివేయండి విషయం మీకే అర్థం అవుతుంది.మహారాష్ట్రలోని ధారశివ్ జిల్లామేసాయి జవల్గా గ్రామ సర్పంచ్ అయిన నామ్‌డియో నికమ్ ప్రస్తుతం పుణేలో నివాసం ఉంటున్నాడు. కానీ పనుల నిమిత్తం గ్రామానికి మూడు నాలుగు సార్లు వచ్చి వెళ్తుంటాడు. ఈక్రమంలోనే డిసెంబర్ 26వ తేదీ రోజు కూడా గ్రామానికి వస్తున్నాడు. తనకు చెందిన ఎస్‌యూవీ వాహనంలో డ్రైవర్ సహా మరో అధికారిని వెంటబెట్టుకుని బయలు దేరాడు. రాత్రి 10 గంటల సమయంలో తుల్జాపూర్‌కు చేరగానే రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు వ్యక్తులు వచ్చారు.కారును అడ్డగించి మరీ వారి వెంట తెచ్చుకున్న సుత్తెతో కారు విండో పగులగొట్టారు. ఆపై కారులోకి ఓ కండోమ్‌ను విసిరారు. అయితే అందులో అప్పటికే పెట్రోల్ నింపి ఉంది. ఆపై నిప్పంటించి అక్కడి నుంచి పారిపోయారు నిందితులు. ఈ ఘటనలో సర్పంచ్ సహా మరో అధికారి గాయపడ్డారు. మళ్లీ వచ్చి వారేమైనా చేస్తారేమోనన్న భయంతో సర్పంచ్ వెంటనే స్థానిక పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. సర్పంచ్ సహా మరో అధికారిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.అయితే సర్పంచ్ నామ్‌డియో నికమ్.. తమకు గ్రామంలోని ఎవరితోనూ శత్రుత్వం లేదని చెబుతున్నారు. మరి ఈ దాడికి పాల్పడింది ఎవరో తెలుసుకునే పనిలో పడ్డారు పోలీసులు. ఇదిలా ఉండగా డిసెంబర్ ప్రారంభంలో బీడ్ జిల్లాలో మాసాజోగ్ గ్రామ సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్‌ను అపహరించి హత్య చేయడంపై పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం అవుతుంది. ఈకేసులో ప్రధాన సూత్రధారి రాష్ట్ర మంత్రి ధనంజయ్ ముండే సన్నిహితుడు వాల్మిక్ దాకర్ అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ గొడవ చల్లారక ముందే మరో సర్పంచ్‌పై దాడి జరగడంతో అంతా ఆందోళన చెందుతున్నారు. పోలీసులు కూడా కేసును సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మహా కుంభమేళాకు ముస్తాబవుతున్న అయోధ్య



మహా కుంభమేళా కోసం అయోధ్య నగరం ముస్తాబవుతోంది. వచ్చే ఏడాది రామమందిరం ప్రారంభోత్సవం తర్వాత తొలిసారి మహా కుంభమేళా జరుగుతుండడం వల్ల అయోధ్యను అందంగా తీర్చిదిద్దుతున్నారు. నూతన ఏడాదిలోకి అడుగుపెట్టడం, బాల రాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశాలు ఉంది. అందుకే ఎలాంటి నిర్వహణ లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన ఏడాది, మహా కుంభమేళా పురస్కరించుకొని అయోధ్య నగరం అందంగా ముస్తాబవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 44 రోజుల పాటు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళా కోసం అక్కడి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ కుంభమేళాకు కోట్ల మంది ప్రజలు తరలిరానున్నారు. కుంభమేళాకు వచ్చిన ప్రజలు అయోధ్య బాలరాముడి దర్శనానికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. రామమందిర ప్రారంభోత్సవం తర్వాత తొలిసారి కుంభమేళా జరుగుతుండడం వల్ల అయోధ్యలోనూ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అదే సమయంలో నూతన ఏడాదిలోకి అడుగుపెట్టడం., బాలరాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో అయోధ్యకు భారీగా భక్తులు తరలి రానున్నారు. దీంతో ఎలాంటి నిర్వహణ లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అయోధ్య రామ మందిర దర్శన వేళలు పెంచుతూ రామ జన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్ నిర్ణయం తీసుకుంది.

**అయోధ్య నగర అలంకరణ**

అయోధ్య నగర వీధులను రాముని చిత్రాలతో అందంగా అలంకరిస్తున్నారు. రామ చరిత మానస్‌ను గోడలపై రూపొందించారు. గుప్తర్ ఘాట్ నుంచి కొత్త ఘాట్ వరకు రామాయణ ఇతివృత్తాలను గోడలపై చిత్రాల రూపంలో రూపొందిస్తున్నారు. రాత్రి వేళలో కూడా కనిపించేలా వాటికి విద్యుత్ దీపాలను అమర్చారు. అయోధ్యకు తరలివచ్చే భక్తుల కోసం మంచి నీటి సదుపాయన్ని ఏర్పాటు చేశారు.

అలాగే అయోధ్యలోని సూరజ్‌కుండ్‌లో లేజర్ షోను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కుంభమేళా జరుగుతోన్న అన్ని రోజులు లేజర్ షో జరుగుతుందని చెప్పారు. రామాయణ చరిత్రను హిందీ, ఇంగ్లీషు భాషలలో వీడియోల రూపంలో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. కుంభమేళా కోసం వచ్చే విదేశీయులు కోసం ఆంగ్ల భాషలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

**హోటళ్లు ఫుల్!**

కొత్త సంవత్సరం వేళ అయోధ్య నగరం పర్యటకులతో కళకళలాడనుంది. నూతన ఏడాది వేళ పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే హోటల్ గదులన్నీ ముందుగానే బుక్ అయినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు స్వాగతం పలికేందుకు అంతా సిద్ధంగా ఉందని జనవరి 15 వరకు హోటల్ గదులన్నీ ముందుగానే బుక్ అయినట్లు స్థానిక హోటల్ యజమానులు చెబుతున్నారు. చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే గదుల లభ్యత ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదే అదనుగా కొందరు హోటళ్ల యజమానులు ఒక్కరోజుకు10వేల రూపాయలు వరకు వసూలు చేస్తున్నట్లు వెల్లడించాయి. రాముడి ఆలయం, హనుమాన్‌గఢి, లతాచౌక్, గుప్తర్ ఘాట్, సూరజ్‌కుండ్, ఇతర ప్రఖ్యాత స్థలాల వద్ద భారీగా భద్రతా ఏర్పాటు చేసినట్లు అయోధ్య పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

**పెరగనున్న డిమాండ్**

మరోవైపు నూతన ఏడాది వస్తున్న వేళ అయోధ్యలో పువ్వులకు గిరాకీ పెరుగుతోంది. జనవరి మూడో తేదీ వరకు పూలకు గిరాకీ ఉండే అవకాశం ఉందని పూలు అమ్మేవాళ్లు చెబుతున్నారు. కొత్త ఏడాది వేళ దేశ నలుమూల నుంచి రాముడి దర్శనానికి భక్తులు రానున్న నేపథ్యంలో పువ్వులకు డిమాండ్ పెరుగుతున్నట్లు చెప్పారు. ప్రధానంగా బంతి పూలు, చామంతి పూలు, గులాబీ పువ్వులకు మంచి గిరాకీ ఉందని తెలిపారు.

# 10 లక్షల విజిటర్స్ వీసాలు..




**ముంబై :** రికార్డు స్థాయిలో విజిటర్స్ వీసాలు సహా మొత్తం పది లక్షలకుపైగా వలసేతర వీసాలను భారతీయులకు జారీచేసినట్టు న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం ప్రకటించింది. వరుసగా రెండో ఏడాది భారతీయులే టాప్‌లో నిలిచినట్టు పేర్కొంది. అలాగే, ఉన్నత విద్య కోసం తమ పౌరులను అమెరికాకు పంపిన దేశాల వరసలోనూ భారత్ మొదటి స్థానంలో నిలిచిందని తెలిపింది. ఈ ఏడాది 3,31,000 మంది విద్యార్థులను భారత్ పంపినట్టు పేర్కొంది. 2008/2009 తర్వాత ఈ స్థాయిలో విదేశీ విద్యార్థులు అమెరికాకు రావడం ఇదే మొదటిసారి.అంతేకాదు, వరుసగా రెండో ఏడాది అత్యధికంగా గ్రాడ్యుయేట్లను అమెరికాకు పంపిన ఘనతను కూడా భారత్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం అమెరికాలో రెండు లక్షల మంది (19 శాతం) భారతీయ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. విద్య తర్వాతి స్థానంలో పర్యాటకం, వ్యాపార అవసరాల కోసం భారతీయులు తమ దేశాన్ని సందర్శిస్తున్నారని అమెరికా కాన్సులేట్ తెలిపింది. గత నాలుగేళ్లలో అమెరికాకు వెళ్లే భారతీయ పర్యటకుల సంఖ్య ఐదు రెట్లు పెరిగి.. 20 లక్షలకు చేరిందని వెల్లడించింది. 2023లో 11 నెలలతో పోల్చితే.. ఈ ఏడాది అదే కాలానికి పెరుగుదల 26 శాతమని తెలిపింది.ఇప్పటికే అమెరికాలో భారత్‌కు చెందిన నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాదారుల 50 లక్షల మంది ఉన్నారని, రోజూ ఈ వీసాలను వేలల్లో జారీ చేస్తున్నామని పేర్కొంది. ఇదే సమయంలో హెచ్-1బీ వీసా పునరుద్ధరణ పైలట్ విధానం మంచి ఫలితాలను ఇచ్చిందని అమెరికా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వీసాదారులు తమ దేశానికి వెళ్లకుండా అమెరికాలోనే రెన్యువల్ చేసుకునేలా ఈ విధానం తీసుకొచ్చారు. ఈ విధానంతో అత్యధికంగా అమెరికాకు ప్రత్యేక వృత్తి నిపుణులను అందిస్తున్న భారత్ ఎక్కువ లబ్ధి పొందనుంది.సాధారణంగా హెచ్-1బీ వీసాపై అమెరికా వెళ్లేవారు.. దాని గడువు ముగియగానే స్వదేశానికి వచ్చి స్టాంపింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రయోగాత్మకంగా చేపట్టిన కొత్త విధానం ప్రకారం.. ఇకపై అమెరికాలోనే వీసాలను రెన్యువల్ చేయించుకునే వెసులుబాటు కలగనుంది."భారతీయులకు 10 వలస వీసాలను జారీ చేశాం.. ఇది చట్టబద్ధమైన, నైపుణ్యం కలిగిన నిపుణుల వలసలను సులభతరం చేసింది... ఈ వీసాదారులు అమెరికాలో శాశ్వత నివాసితులు అయ్యారు.. ఇప్పటికే మా దేశంలో గణనీయంగా ఉన్న ప్రవాస భారతీయులకు వీరు అదనం' అని ఆ ప్రకటన పేర్కొంది. గణాంకాల ప్రకారం.. 24,000 పాస్‌పోర్టులు, ఇతర కాన్సులర్ సేవలను అందించింది. స్మార్ట్ ట్రావెలర్ ఎన్‌రోల్‌మెంట్ ప్రోగ్రామ్ (గుఇఖ)లో మార్పుల వలన ఎంబసీ, కాన్సులేట్‌లను అమెరికా పౌరులను అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించడం, వారికి భద్రతకు హెచ్చరికలను పంపడం సులభతరం చేస్తోంది.

# డెడ్ బాడీ పార్శిల్ లో విస్తుపోయే నిజాలు

**విజయవాడ :** ఉండిలో డెడ్‌బాడీ డోర్ డెలివరీని కేసును పోలీసులు చేధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు శ్రీధర్ వర్మ అలియాస్ సుధీర్ వర్మతో పాటు అతని రెండో భార్య రేవతి మూడో భార్య సుష్మలను అరెస్ట్ చేశారు. రేవతి అక్క తులసి పేరిట ఉన్న ఆస్తి కోసం అమాయకుడిని హత్య చేసి ఆ శవాన్ని మహిళ ఇంటికి పార్సిల్ పంపి ఆపై బెదిరింపులకు పాల్పడినట్టు గుర్తించారు. నిందితుల వివరాలను పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ నయీం అస్మీ వెల్లడించారు.ఉండి మండలం యండగండి గ్రామంలో ముదునూరి రంగరాజు నివాసానికి చెక్క పెట్టెలో మృతదేహం డెలివరీ చేసిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సొంత వదినను బెదిరించి భయపెట్టడానికి గ్రామానికి చెందిన పర్లయ్యను హత్య చేసి చెక్కపెట్టెలో డెలివరీ చేసినట్టు నిందితులు అంగీకరించారు. నిందితుడి రెండో భార్య రేవతి అక్క పేరుతో ఉన్న మూడెకరాల పొలం కోసమే ఈ డ్రామా నడిచినట్టు జిల్లా పోలీసులుప్రకటించారు.గ్రామానికి చెందిన పర్లయ్యను ప్రధాన నిందితుడు తిరుమాని శ్రీధర్ వర్మ హత్య చేసి చెక్కపెట్టెలో తన మూడో భార్య సాయంతో ఆటోలో తులసి ఇంటికి పంపినట్టు గుర్తించారు.శ్రీధర్ వర్మ రెండో భార్య రేవతి అక్క సాగి తులసి పేరిట ఉన్న మూడెకరాల పొలాన్ని కాజేయడానికి ఈ హత్యకు పాల్పడినట్టు గుర్తించారు.చెక్క పెట్టెలో శవాన్ని పంపి హత్య కేసులో ఇరుక్కుంటావని బెదిరించి ఆమెను బెదిరించే ప్రయత్నం బెడిసికొట్టింది. నిందితుడు శ్రీధర్‌వర్మ కూలీ పనికోసం వచ్చిన కాళ్ల గ్రామానికి చెందిన గాంధీనగరం వాసి బర్రె పర్లయ్యను నిందితుడు శ్రీధర్ వర్మ గొంతుకు ఉరి బిగించి హత్య చేశాడు. కాళ్ల మండలం కోపల్లె నుంచి ఉండి వచ్చే వాంద్రం దారిలో పర్లయ్యను నిందితుడు హత్య చేశాడు.కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం మల్లంపూడి గ్రామానికి చెందిన తిరుమాని శ్రీధర్ వర్మ అమ్మాయిలకు వల వేయడంలో దిట్ట. శ్రీధర్ వర్మకు మొదట ఎలిజబెత్ రాణితో పెళ్లైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోషల్ మీడియాలో మహిళలను వలపన్నడంలో ఆరితేరాడు. తనది కూడా క్షత్రియ సామాజిక వర్గమేనని నమ్మించి యండగండికి చెందిన రేవతిని పదేళ్ల క్రితం ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత గణపవరం మండలానికి చెందిన సుష్మను కూడా వివాహం చేసుకున్నాడు.రేవతి అక్క పేరుతో ఉన్న ఆస్తిని కాజేయడానికి పథకం పన్నిన శ్రీధర్ వర్మకు అతని ఇద్దరు భార్యలు సహకరించారు. సొంత అక్కను బెదిరించి ఆస్తిని కాజేయాలనే ప్లాన్‌కు తులసి సోదరి రేవతి సహకరించింది. తులసికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఈ ఇంటికి క్షత్రియ సేవా సంఘం నుంచి నిర్మాణ సామాగ్రిని అందిస్తున్నట్టు నమ్మించారు.ఈ క్రమంలో శవాన్ని ఇంటికి పంపడం ద్వారా తులసిని భయపెట్టాలని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో శవం దొరక్క పోవడంతో ఒంటరిగా ఉంటున్న పర్లయ్యను హత్యచేసిన ఆ శవాన్ని చెక్కపెట్టెలో తులసి ఇంటికి పంపారు. మొదటి రోజు వర్షంలో కారు టైర్ పంక్చర్ కావడంతో పెట్టెను గాంధీనగరంలో ఇంట్లో ఉంచారు. మర్నాడు ఆటోలో యండగండిలోని తులసి ఇంటికి పార్సిల్ పంపారని ఉండి పోలీసులు వివరించారు.ఎలక్ట్రిక్ సామానులు వచ్చాయని చెక్క పెట్టె తెరిచిన తులసికి అందులో శవం చూసి భయపడింది. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న శ్రీధర్ వర్మ శవం విషయం బయటకు పొక్కకుండా తాను చూసుకుంటానని ఆస్తి పత్రాలపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేశారు. సంతకాలు చేయకపోతే ఆమెను కూడా శవంగా మారుస్తామని బెదిరించారు. ఫోన్ కూడా లాగేసుకోవడంతో తులసి షాక్‌కు గురైంది. ఈ లోపు టాయ్‌లెట్‌కు వెళ్తానని చెప్పిన తులసి మరో ఫోన్ నుంచి గ్రామస్తులకు సమాచారం అందించింది. దీంతో తులసి ఇంటికి కొందరు చేరుకోవడంతో శ్రీధర్యండగొండిలో శవం విషయం బయటకు పొక్కడంతో శ్రీధర్ వర్మ మూడో భార్య సుష్మ, కూతురితో కలిసి కృష్ణాజిల్లా బంటుమిల్లి మీదుగా మంగినపూడి చేరుకున్నాడు. తాళ్లపాలెంలో కారును విడిచి గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. పోలీసులు ఆరా తీయడంతో గ్రామంలోకి కొత్తగా వచ్చిన వారి గురించి పోలీసులకు సమాచారం అందింది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించడంతో కేసు మిస్టరీ వీడింది. నిందితుడి బ్యాంకు ఖాతాల్లో కోట్ల నగదు ఉండటం గుర్తించిన పోలీసులు అతని వ్యవహారాలపై ఆరా తీస్తున్నారు.

# ఆలయం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు

**కరీంనగర్ :** వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది. మొన్న రాజన్న కోడలు అక్రమంగా విక్రయానికి గురైన ఘటన మరిచిపోక ముందే ఆలయంలోని హుండీలో నగదు మాయం కలకలం సృష్టిస్తుంది. మరోవైపు మాంసాహారం ఆలయ ఆవరణలో పంపిణీ విమర్శలకు తావిస్తుంది.దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ లో వరుస ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్యలు సాగుతుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తుంది. నిత్యం వేలాది మంది భక్తులు సందర్శించే రాజన్న ఆలయంలో అధికారుల నిర్లక్ష్యం, నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.గర్భాలయంలోని హుండీల నుంచి నగదు చోరీ అధికారుల నిర్లక్ష్యానికి, నిఘా వైఫల్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది. వారంలో మూడు సార్లు హుండీల నుంచి మైనర్లు డబ్బులు తీసుకుపోతుంటే నిఘా కెమెరాలు, భద్రతా సిబ్బంది, హడావిడి చేసే ఆలయ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొక్కుబడి చర్యలతో చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తి భావంతో భక్తులు సమర్పించే కానుకలు చోరీకి గురికావడం, కోడెలు అక్రమంగా విక్రయించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.ప్రస్తుతం హుండీలో నగదు ఎత్తుకెళ్లిన ఇద్దరు మైనర్లను పోలీసులు గుర్తించారు. అరెస్టు చేసి జువెనైల్ కు తరలించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టారు. గతంలో పలువురు హుండీలలోని నగదు కాజేసి కటకటాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఓవైపు కోడెల గోల నడుస్తుంటే, ప్రస్తుతం హుండీలోని నగదు మైనర్లు ఎత్తుకెళ్లడం అధికారుల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తుంది.మరోవైపు ఆలయ ఆవరణలో మాంసాహారం పంపిణీ వివాదాస్పదంగా మారింది. క్రిస్మస్ రోజున ఆలయ ఆవరణలో చికెన్ రైస్ ఎగ్ రైస్ గుర్తుతెలియని వ్యక్తులు పంపిణీ చేశారు. అన్యమత ప్రచారం అంటూ సర్వత్రా ఆందోళన వ్యక్తం కావడంతో అప్రమత్తమైన పోలీసులు, ఆలయ అధికారులు విచారణ చేపట్టారు. చివరకు చికెన్ రైస్ ఎగ్ రైస్ ఆలయ ఆవరణలో పంపిణీ చేయలేదని బయట పంపిణీ చేసిన దాన్ని నిత్యం అక్కడ అడుక్కునే నిరుపేద భక్తులు ఆలయ ఆవరణలోకి తీసుకొచ్చినట్లు స్పష్టం చేశారు. మరోసారి అలా జరగకుండా కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.ఆలయ అధికారులు, నిఘా వర్గాలు చేతులుకాలక ఆకులు పట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకుండా హుండీలో నగదు మాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసి? ఆలయ ఆవరణలో మాంసాహారం పంపిణీతో శుద్ధిచేసి సంప్రోక్షణ నిర్వహించారు. ఇకనైనా అధికారులు మేల్కొని పకడ్బందీ చర్యలు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిచో ఆందోళన చేపట్టక తప్పదని విశ్వహిందూ పరిషత్, బిజెపి నాయకులు హెచ్చరించారు.మరోవైపు గత నెలలో రైతుల పేరిట రాజన్న కోడెలు పొంది అక్రమంగా విక్రయించిన విషయంపై అధికారులు విచారణ చేపట్టారు. ఇప్పటికే వరంగల్ జిల్లాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసి అక్రమంగా కోడెలు పొందిన వారి నుంచి 26 కోడెలు స్వాధీనం చేసుకుని రాజన్న గోషాలకు తరలించారు.మరోవైపు ఏడాది కాలంగా రాజన్న కోడెలు 1975 పొందిన వారు రైతులా, రైతుల ముసుగులో దళారులా అని తేల్చేందుకు సమగ్ర సర్వే చేపట్టారు. సర్వే కోసం 20 మందిని నియమించి తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాలకు, జిల్లాకు ఇద్దరు చొప్పున నియమించి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు నివేదిక సమర్పించనున్నారు. కలెక్టర్ సైతం రాజన్న గోశాలను సందర్శించి పశువుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆలయ అధికారులను, పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.

# సినిమాలు అలా తీయడం సాధ్యమేనా

**హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డితో చిత్ర ప్రముఖుల భేటీ విఫలం అనే చెప్పాలి. వారు కోరుకున్నది జరక్కపోగా కొత్త ఆంక్షలు మోపి పంపారు . అయితే రేవంత్ రెడ్డి చెప్పినట్లు సినిమాలు తీయడం సాధ్యమేనా అనే ప్రశ్న మొదలైంది.సంధ్య థియేటర్ ప్రమాదంలో మహిళ మృతి చెందిన నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి ఇకపై తెలంగాణలో బెనిఫిట్ షోలు ఉండవు. టికెట్స్ పెంపుకు కూడా అనుమతులు ఇవ్వమని తేల్చి చెప్పాడు. మరో రెండు వారాల్లో సంక్రాంతి సినిమాల విడుదల ఉంది. గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలు విడుదల కానున్నాయి. ఈ చిత్రాలపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపనుంది.అలాగే భవిష్యత్తులో టాలీవుడ్ లో తెరకెక్కే భారీ బడ్జెట్ చిత్రాలు నష్టపోతాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి తన నిర్ణయంపై పునరాలోచన చేయాలి. ఆయన్ని బెనిఫిట్ షోలు, టికెట్స్ హైక్ కి ఒప్పించాలని భేటీ అయ్యారు. ఎఫ్ డీ సీ చైర్మన్ దిల్ రాజు నేతృత్వంలో దర్శక నిర్మాతలు, హీరోలు రేవంత్ రెడ్డిని కలిశారు. ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు.రేవంత్ రెడ్డి చిత్ర ప్రముఖుల ఆశలపై నీళ్లు చల్లారు. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన ప్రతిపాదనలు, విధించిన ఆంక్షలు షాక్ ఇచ్చేలా ఉన్నాయి. శాంతి భద్రతల విషయంలో రాజీ పడేదిలేదన్న రేవంత్ రెడ్డి? అసెంబ్లీలో చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నానని నిర్మొహమాటంగా చెప్పారు. టికెట్స్ హైక్ తో పాటు బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వడం కుదరదు అన్నారు. ప్రయోజనం కోరి వెళ్లిన చిత్ర ప్రముఖులకు ఆయన పెట్టిన ఆంక్షలు మరింత ఆందోళనకు గురి చేశాయి.హీరోలు తమ



పాపులారిటీ వాడి తెలంగాణకు పెట్టుబడులు తేవాలి. టూరిజం డెవలప్ చేయాలి. ప్రతి సినిమా హీరో తమ మూవీ విడుదలకు ముందు డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా క్యాంపైన్ చేయాలని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిని ఒక సోషల్ రెస్పాన్సిబిలిటీగా భావించి, ఆ దిశగా అడుగులు వేయాలని అన్నారు. స్టార్ హీరోల బౌన్సర్స్ పబ్లిక్ కి హానీ కలిగించేలా ప్రవర్తిస్తే ఊరుకునేది లేదు. ఇకపై వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. అలాగే అభిమానులను హీరోలు కంట్రోల్ లో పెట్టుకోవాలి. నేతలపై సోషల్ మీడియాలో దూషణలకు పాల్పడకుండా అదుపు చేయాలని సూచించారు.ఇవన్నీ పర్లేదు. కాగా సినిమాల్లో అసాంఘిక కార్యక్రమాలతో కూడిన సన్నివేశాలు. పాత్రలు ఉండకూడదని ఆయన హుకుం జారీ చేశాడట. డ్రగ్స్ వాడకంతో పాటు యాంటీ సోషల్ ఎలిమెంట్స్ లేకుండా చూసుకోవాలని చెప్పారట. స్టార్ హీరోల సినిమాలన్నీ వీటితోనే నిండి ఉంటాయి. త్వరలో రానున్న చిత్రాల్లో కొన్ని చిత్రాల్లో గ్యాంగ్ స్టర్ రోల్స్ చేస్తున్నారు. అది కూడా యాంటీ సోషల్ ఎలిమెంటే. ఫ్యాక్షన్ సబ్జెక్టులు, క్రైమ్ థ్రిల్లర్స్ కూడా ఈ కోవకే వస్తాయి. అసలు చెడు అనేది మచ్చుకైన లేకుండా సినిమాలు తీయడం సాధ్యమయ్యే పనేనా అనే వాదన తెరపైకి వచ్చింది.

# రెండు రోజులు జరాభద్రం./. వాతావరణ శాఖ వార్నింగ్

**హైదరాబాద్ :** తెలంగాణ వెదర్‌పై హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు కీలక అప్డేట్ ఇచ్చారు. రాష్ట్రంలో రానున్న 5 రోజులు అక్కడక్కడ ఉదయం వేళ పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-4 డిగ్రీలు పడిపోతాయని హెచ్చరించారు. రేపు, ఎల్లుండి పొగమంచు ఎక్కువగా ఉంటుందని రేపు 20-27 డిగ్రీలు, ఎల్లుండి 18-27 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు అంచనా వేసారు. తూర్పు/ఆగ్నేయ దిశలో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో నేడు పలు చోట్ల తేలికపాటి వర్షాలకు ఛాన్స్ ఉన్నట్లు వెల్లడించారు. ఎలాంటి హెచ్చరికలు లేకపోయినప్పటికీ.. చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచించారుఇక నైరుతి, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బంగాళాఖాతం, దక్షిణ ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీర ప్రాంతాలలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడినట్లు భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం అదే ప్రాంతంలో ఇప్పుడు సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ వరకు విస్తరించి ఉందని అన్నారు. దీని ఫలితంగా ఏపీలో వర్షాలు కురుస్తాయన్నారు. ఉత్తర కోస్తాలో నేడు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అంచనా వేశారు. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని.. ఈదురు గాలులు గంటకు 30-40 కిలోమీటర్లు.. గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో గత మూడ్రోజులు వర్షాలు కురిశాయి. వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షం తీవ్రత ఎక్కువగా ఉంది. బుధవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం నగరంలో పొడి వాతావరణం నెలకొని ఉంది. మేఘాలు లేకపోవటంతో చలి తీవ్రత కాస్త పెరిగింది. రానున్న రోజుల్లో ఇదే వాతావరణం ఉంటుందని.. చలి తీవ్రత పెరిగే ఛాన్స్ ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు అలర్ట్ జారీ చేశారు.

## పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు.. రంగంలోకి అధికారులు

-మొదటిపేజీ తరువాయి

కంట్రోల్ బోర్డు(పీసీబీ) చైర్మన్ కృష్ణయ్య, పీసీబీ కాకినాడ రీజనల్ ఆఫీసర్ శంకరరావుతో ఫోన్లో డిప్యూటీ సీఎం మాట్లాడారు. యూనివర్సల్ బయోఫ్యూయల్స్ సంస్థ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తుందో? లేదో? పరిశీలించి తక్షణమే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలకు వాయు కాలుష్య సమస్యలు లేకుండా చూడాలని స్పష్టంచేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ముడి పదార్థాలు వాడుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఫలితంగా ఘాటైన, దుర్గంధపూరిత వాయువులు వస్తున్నాయని అధికారులు తెలిపారు. దీనిపై మరింత లోతుగా తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

**యూనివర్సల్ బయో ఫ్యుయల్ కంపెనీ మూసివేత**

యూనివర్సల్ బయో ఫ్యుయల్ కంపెనీపై కాలుష్యంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీలో తనిఖీలు చేయాలని కాకినాడ పీసీబీ అధికారులకు ఆదేశించారు. ఈనెల 21న చేపట్టిన తనిఖీల్లో ముడిపదార్థాల కింద వాడే పాం ఫ్యాటీ యాసిడ్‌లో కల్తీ చేసినట్లు నిర్ధారణ చేశారు. ముడి సరుకు ధరలు పెరగడంతో కల్తీ రసాయనం వాడినట్లు పీసీబీ అధికారులు తేల్చారు. ఈనెల 24న ఫ్యాక్టరీని అధికారులు మూసివేశారు. త్వరలో సమగ్ర స్థాయిలో విచారణ చేపడతామని పీసీబీ అధికారులు తెలిపారు.

ఆ తాబేళ్ల మరణంపై విచారణ చేపట్టాలి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్కాకినాడ తీరంలో ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మరణంపై విచారణ చేపట్టాలని అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. కాకినాడ బీచ్ రోడ్, ఏపీఐఐసీ, వాకలపూడి ప్రాంతాల్లో అరుదైన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు అత్యధిక సంఖ్యలో మరణిస్తున్నాయని చెప్పారు. ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మరణానికి కారణాలపై విచారణ జరిపి ఇందుకు కారణం అవుతున్న వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. వన్యప్రాణుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ చిరంజీవి చౌదరికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు.

## తెలుగు భాష పరిరక్షణ కోసం కృషి

**విజయవాడ:** అధికారుల కోసం కూడా తెలుగు భాషపై సదస్సు నిర్వహించాలని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో ఆదేశాలు తెలుగులో వచ్చేలా చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలుగు భాష ఔన్నత్యం గురించి అందరూ తెలుసుకోవాలని మంత్రి సత్యకుమార్ తెలిపారు. విజయవాడలో జరుగుతున్న 6వ ప్రపంచ తెలుగు మహా సభల్లో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ... గొప్ప వారి ముందు కూర్చున్నప్పుడు తనలో ఆత్మనూన్యతాభావన వస్తుందని.. వారి ద్వారా తాను ఎన్నో విషయాలు తెలుసుకుని.. ఆచరిస్తానని చెప్పారు. ఆంగ్లం మాట్లాడితే తాము చాలా గొప్ప అనే భావన చాలా మందిలో ఉందని.. కానీ దేశ భాషలందు తెలుగు లెస్స అన్న రాజులెందరో ఉన్నారని గుర్తుచేశారు. నన్నయ్య, తిక్కన్న, ఎర్రన్న పేర్లను ప్రస్తావించకుండా తెలుగు భాష గురించి మాట్లాడలేమని అన్నారు. ఆ తర్వాత అనేక మంది మహానుభావులు తెలుగు భాష పరిరక్షణకు పాటుపడ్డారని ఉద్ఘాటించారు. రాజకీయంగా నేతల మధ్య సైద్ధాంతిక విబేధాలు ఉన్నా.. భాష కోసం అందరూ కలిసి నడవాలని సూచించారు. తెలుగు భాష కోసం చేపట్టిన యజ్ఞంలో తాను కూడా భాగస్వామిగా నడుస్తానని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.


## నేతలు... కాదు కేడర్ పైనే...

-మొదటిపేజీ తరువాయి

అవుతున్నప్పటికీ పవన్ కల్యాణ్ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై పెద్దగా ఫోకస్ పెట్టలేదు. కార్యకర్తలతో కూడా పెద్దగా సమావేశం అవ్వడం లేదు. ఆయన ఉప ముఖ్యమంత్రి కావడంతో పార్టీ కార్యక్రమాలకు కూడా పెద్దగా సమయం కేటాయించడం లేదు.. పవన్ కల్యాణ్ ఈరోజే కాదు ఎప్పటి నుంచో ఒకే లెక్కతో ఉన్నారు. నియోజకవర్గాల్లోనూ, బూత్ లెవెల్లో పార్టీని బలోపేతం చేసినా ప్రయోజనం లేదని భావిస్తున్నారు. అలా అన్ని హంగులున్న పార్టీలు ఎన్నికల్లో ఎందుకు ఓడిపోతాయని ఆయన లెక్క. అందుకే పార్టీని బలోపేతం చేయడం కంటే.. పార్టీని జనంలోకి తీసుకెళ్లడమే ప్రధాన ధ్యేయమని పవన్ కల్యాణ్ గట్టిగా విశ్వసిస్తున్నట్లుంది. అందుకే 2014లో ఆయన పార్టీ పెట్టినా ఎక్కడా పెద్దగా పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం చేయలేదు. కేవలం కొన్ని జిల్లాల్లో తనకు నమ్మకమైన వారికి మాత్రమే జిల్లా బాధ్యతల పగ్గాలను అప్పగించారు. నేతల వల్ల ఓట్లు రావని, పార్టీ మీద నమ్మకముంటే జనం వెంట నిలబడతారని పవన్ కల్యాణ్ బలంగా నమ్ముతున్నారు. 2014లో పార్టీ పెట్టినా, 2019 ఎన్నికల్లో మాత్రమే ఆయన సింబల్ తో బరిలోకి దిగారు. అయితే అన్ని స్థానాల్లో పోటీ చేసినా కేవలం ఒకే ఒక్క స్థానంలో గెలిచింది. తాను పోటీ చేసిన రెండు నియోజకవర్గాల్లోనూ ఓటమి పాలయ్యారు. అంటే నమ్మకం లేకనే ప్రజలు తమకు అండగా నిలబడలేదని నమ్ముతున్నారు. అదే 2024లో 21 నియోజకవర్గాల్లో పోటీ చేస్తే వంద శాతం స్ట్రయిక్ రేట్ తో అన్ని చోట్ల గెలిచారు. రెండు పార్లమెంటు స్థానాలను గెలుచుకున్నారు. అయితే ఎన్నికలకు ముందు ఎంపిక చేసిన నేతలకే టిక్కెట్లు ఇచ్చారు. ఆచితూచి వ్యవహరించడంతో ఈ ఎన్నికల్లో వారు గెలిచారని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. క్యాడర్ గ్రామ గ్రామాన ఉన్నా, వాడవాడలా నేతలున్నా పార్టీకి ఇబ్బందులే తప్ప ప్రయోజనం ఉండదన్న పవన్ లెక్కలు కరెక్టేనని అనిపిస్తున్నాయి. ఇప్పటికీ కొన్ని జిల్లాల్లోనే జనసేన ఉంది. పాత విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లోనే ఎమ్మెల్యేలందరూ విజయం సాధించారు. అన్నమయ్య జిల్లాలోని రైల్వే కోడూరు నియోజకవర్గంలో మాత్రం జనసేన గెలిచింది. మిగిలిన జిల్లాల్లో జనసేనపార్టీ అభ్యర్థులను పోటీ పెట్టలేదు. గెలవలేదు. అక్కడ పార్టీ ఉన్నా లేనట్లే. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత బాలినేని శ్రీనివాసులురెడ్డి, సామినేని ఉదయభాను, కిలారు రోశయ్యలను చేర్చుకున్న పవన్ కల్యాణ్ తర్వాత పెద్దగా చేరికలపై కూడా శ్రద్ధపెట్టలేదు. అందుకు కారణం తన లెక్క కరెక్టే అయితే వచ్చే ఎన్నికల నాటికి నేతలు వారంతట వారే వస్తారని, టిక్కెట్లు ఇచ్చిన వారంతా గెలవాలన్న ఉద్దేశ్యంతో పవన్ కల్యాణ్ పార్టీని పూర్తిగా పక్కన పెట్టేసినట్లు కనపడుతుంది. అనేక జిల్లాల్లో సరైన నాయకత్వం లేకపోయినా పెద్దగా పట్టించుకోవడం లేదు. అన్ని జిల్లాలకు తానే నాయకుడనన్నభావనలో ఆయన ఉన్నట్లే కనపడుతుంది.

## ఏపీలో కేబినెట్ విస్తరణ?

-మొదటిపేజీ తరువాయి



చర్చనీయాంశంగా మారింది. అయితే సీనియర్లు కొంత అసంతృప్తితో ఉన్నప్పటికీ కక్కలేక, మింగలేక కొందరు నేతలు తమ అసంతృప్తిని అలాగే అణిచిపెట్టుకుని ఉన్నారు. సామాజికవర్గం పరంగా కూడా లెక్కలు వేసి మరీ చంద్రబాబు కేబినెట్ లోకి తీసుకున్నారు. అయితే కొందరు చంద్రబాబు అంచనాలకు అందుకోలేని విధంగా మంత్రులు పనితీరు ఉంది. అంతేకాకుండా వారి వల్ల పార్టీలో లేనిపోని తలనొప్పులు వస్తుండటం కూడా ఏరివేతకు కారణం అని చెబుతున్నారు.జిల్లాల్లో నేతలను సమన్వయం చేసుకోలేకపోవడంతో పాటు తమకు కేటాయించిన శాఖలపై పట్టు సంపాదించకపోవడంతో పాటు అధికార యంత్రాంగం పై కూడా గ్రిప్ లేకపోవడం కూడా చంద్రబాబు మంత్రులను తీసివేయడానికి కారణమని చెబుతున్నారు. కీలకమైన శాఖలను నమ్మి అప్పగించినా వారి పనితీరు సరిగా లేకపోవడంతో విమర్శలను ఎదుర్కొనాల్సి వస్తుందని కూడా అభిప్రాయపడుతున్నారు. అయితే ఏడాది కూడా గడవకముందే పనితీరును ఎలా బేరీజు వేస్తారన్న ప్రశ్నలు వినపడుతున్నాయి. అయితే మంత్రులను తొలగించకపోతే మిగిలిన వారిలో భయం ఉండదని, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలకు కూడా కొందరు స్పందించకపోవడంపై కూడా చంద్రబాబు అసహనంగా ఉన్నట్లు తెలుస్తోంది.


## సంపాదకీయం

# ధరల నిర్ణయాధికారంతోనే సాగు బాగు

మానవుని జీవన విధానం వ్యవసాయంతో ముడిపడి ఉన్నది. మానవుడి నాగరిక జీవితానికి వ్యవసాయమే మూలాధారం. సింధు లోయ నాగరికత నుంచే మన దేశంలో వ్యవసాయం ప్రధాన జీవన ఆధారంగా ఉండేది. ఆ కాలంలో అన్నదాతలు సిరిసంపదలతో వర్ధిల్లేవారు. ఆధునిక భారతదేశంలో వ్యవసాయ రంగంలో సాంకేతికత అభివృద్ధి వల్ల పెనుమార్పులు సంభవించాయి. వ్యవసాయ రంగం దేశ ప్రగతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడుతున్నది. అందువల్లే వ్యవసాయ రంగాన్ని దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా పరిగణిస్తారు. దేశాన్ని కాపాడుకోవడంలో రైతు కీలక పాత్ర పోషిస్తున్నాడు. అది స్వతంత్ర పోరాటమైనా, కరువుకాటకాలైనా, ఎలాంటి పరిస్థితుల్లోనైనా అన్ని తానై ముందుండి దేశ ప్రజలను రక్షించడంలో రైతుల పాత్ర వెలకట్టలేనిది. నిత్యం శ్రమిస్తూ దేశ ప్రజలకు అన్నం పెట్టడంలో రైతుకు సాటి ఎవ్వరూ లేరు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇంచుమించు 50.82 మిలియన్ టన్నులు ఉండగా.. రైతుల నిరంతర శ్రమ వల్ల 2023-24 నాటికి 332.32 మిలియన్ టన్నులకు చేరుకున్నది. మన దేశంలో సుమారుగా 80.54 కోట్ల మంది ఉచితంగా ఆహార ధాన్యాలను పొందుతున్నారంటే వారి కృషి ఫలితమే. సంవత్సర తలసరి నికర ఆహార ధాన్యాల లభ్యత 1950లో 144.1 కిలోగ్రాములు కాగా.. 2023 నాటికి అది 207.6 కిలోగ్రాములకు చేరింది. అంటే దినసరి తలసరి నికర ఆహార ధాన్యాల లభ్యత 568.8 గ్రాములు. ఈ విధంగా కర్షకులు దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కానీ, వారు మాత్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. పంట విత్తిన సమయం నుంచి కోతకోసి అమ్మే వరకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక హెక్టార్ విస్తీర్ణంలో వరి సాగుకు కౌలు, కుటుంబ శ్రమ కలుపుకొని సుమారు రూ.లక్ష పెట్టుబడి అవుతున్నది. అందులో అధికంగా కూలీలకు (22.1%), ఎరువులకు (20.8%), విత్తనాలకు (11.5%), మందులకు (8.3%) ఖర్చవుతుంది. దేశ వ్యవసాయ కూలీ సగటు రోజువారీ వేతనం రూ.361.52 (2022-23 గణాంకాలు). నమ్మలేని నిజం ఏమిటంటే మన దేశంలో వ్యవసాయ కూలీ ఆదాయం కంటే రైతు ఆదాయం తక్కువ. వ్యవసాయ ఖర్చులు పెరగడం అన్నదాతలకు ప్రధాన సమస్యగా మారింది. ఉదాహరణకు ఒక హెక్టార్ విస్తీర్ణంలో వరి సాగుకు కౌలు, కుటుంబ శ్రమ కలుపుకొని సుమారు రూ.లక్ష ఖర్చు అవుతున్నది. అందులో అధికంగా కూలీలకు (22.1%), ఎరువులకు (20.8%), విత్తనాలకు (11.5%), మందులకు (8.3%) ఖర్చవుతుంది. వ్యవసాయ కూలీ సగటు రోజువారీ వేతనం రూ.361.52 (2022-23 గణాంకాలు). నమ్మలేని నిజం ఏమిటంటే మన దేశంలో వ్యవసాయ కూలీ ఆదాయం కంటే రైతు ఆదాయం తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2019లో వ్యవసాయ కుటుంబ సగటు నెలసరి ఆదాయం రూ.10,218 మాత్రమే. మన దేశంలోని 50.2 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో చిక్కుకున్నాయి. అందులోనూ 82.9 శాతం చిన్న, సన్నకారు రైతుల కుటుంబాలే కావడం గమనార్హం. దేశంలో రైతుల సగటు అప్పు రూ.7,412. అదేవిధంగా రెండు తెలుగు రాష్ట్రాల వ్యవసాయ కుటుంబాలు దేశంలోనే అత్యధిక శాతం అప్పుల బారినపడ్డాయని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. రైతుల అప్పుల్లో 69.9 శాతం సంస్థాగత రుణాలు కాగా.. మిగతా 30 శాతం రుణాలు వడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, భూస్వాములు, చిట్ ఫండ్ కంపెనీలు ఇచ్చినవే. పెట్టుబడికి డబ్బులు లేక, సంస్థాగత రుణాలు సమయానికి అందకపోవడంతో వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి రుణాలు తీసుకొని అప్పుల పాలవుతున్నారు. అప్పుల భారం తట్టుకోలేక చివరికి ఆత్మహత్య చేసుకుంటున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం.. 2022లో సుమారు 11,290 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దేశ రైతాంగాన్ని అనేక సమస్యలు పట్టిపీడిస్తున్న తరుణంలో వాటిని అధిగమించి అన్నదాతల ఆదాయం పెంచాలంటే వ్యవసాయ రంగంలో నూతన సంస్కరణలు, సాకేతికత వినియోగం తక్షణావసరం. సాగు ఖర్చులు, పంట కోనుగోలు, గిట్టుబాటు ధర, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థ లాంటి అనేక అంశాల మీద సమగ్ర సంస్కరణలు తీసుకురావాలి. ప్రత్యేకించి, స్థానిక సమస్యలకు అనుగుణంగా వ్యవసాయ సంస్కరణలు ఉండాలి. ముఖ్యంగా పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలి. ఒకవేళ పంటను ప్రైవేట్ వ్యాపారులు, దళారులు కొన్నప్పుడు తప్పనిసరిగా ఆ ధరలు, కనీస మద్దతు ధర కంటే అధికంగా ఉండేటట్టు చట్టాలను తీసుకురావాలి. విత్తనాల కొనుగోలుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ప్రభుత్వ సంస్థల నుంచి రైతులకు సమయానికి, సరిపడా విత్తనాలు లభించడం లేదు. 2023లో 464.14 లక్షల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అవసరం ఉండగా, ప్రభుత్వ సంస్థల నుంచి 133.84 లక్షల క్వింటాళ్లు, ప్రైవేట్ వ్యాపారుల నుంచి 380.41 లక్షల క్వింటాలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. రైతులకు సరిపడా విత్తనాలను అందించేందుకు ప్రభుత్వ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో మరిన్ని విత్తన ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. అదేవిధంగా, నేల సారవంతం చేసేందుకు, చీడపీడల నివారణకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఈ రకమైన ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. అందులో భాగంగా సమగ్ర సస్యరక్షణ, పోషక నిర్వహణ కిట్లను అందజేయడం ద్వారా ఖర్చులను కొంతమేరకు తగ్గించవచ్చు. అంతేకాకుండా, వ్యవసాయ కూలీల ఖర్చును తగ్గించడానికి యంత్రాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. అందుకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ముందుకు రావాలి. తక్కువ ధరలకు యంత్రాలను అందుబాటులోకి తేవాలి. సంప్రదాయ వ్యవసాయంలోని మెలకువలు, నైపుణ్యాలను కొనసాగిస్తూనే.. సాంకేతిక పరిజ్ఞానాన్ని పంటల సాగుకు ఉపయోగించడం వల్ల వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించవచ్చు. ఆధునిక డిజటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి సేద్యంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. వ్యవసాయ డిజిటలీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌తో రానున్న దశాబ్దాల్లో దేశ వ్యవసాయ రంగం నూతన రూపం సంతరించుకోబోతున్నది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లోని అగ్రిస్టాక్ దేశ వ్యవసాయానికి సంబంధించిన బృహత్తర సమాచార నిధిగా మారబోతున్నది. అగ్రిస్టాక్ ద్వారా సేకరించిన సమాచారం డిజిటల్ వ్యసాయానికి పునాది కాబోతున్నది. కృత్రిమమేధ, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్ లాంటి అనేక సాంకేతిక విధానాలను సాగుకు సంబంధించిన నిర్ణయాలను తీసుకోవడానికి, అవరోధాలను పసిగట్టి నివారించడానికి ఉపయోగించవచ్చు. స్మార్ట్ ఫార్మింగ్‌లో భాగంగా వివిధ అప్లికేషన్లను ఉపయోగించి ఉచితంగా విత్తన రకాలను ఎంచుకోవడం, నేలల రకాలకు అనుగుణంగా ఎరువుల వాడకం, తెగుళ్లను, పురుగులను గుర్తించడం, సరైన మందులను పిచికారీ చేయడం, వాతావరణంలోని మార్పులను తెలుసుకోవడం, దిగుబడులను అంచనా వేసి మార్కెట్లోని ధరల హెచ్చుతగ్గులను తెలుసుకోవచ్చు. అందుకు రైతులకు డిజిటల్ పరిజ్ఞానం చాలా అవసరం. కాబట్టి, దేశంలోని అన్నదాతలకు అందుకు అవసరమైన శిక్షణ ఇచ్చి కనీస అవగాహన కల్పించాలి. ఆధునిక భారతదేశం సాంకేతికత పరంగా అభివృద్ధి సాధించినప్పటికీ, రైతాంగం స్థితిగతులను మార్చే విషయంలో అది ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. వ్యవసాయ రంగంలో సాంకేతికతను కొంతవరకు ఉపయోగిస్తున్నప్ప టికీ ఆశించిన ఫలితాలు మాత్రం రావడం లేదు. రైతులు లాభపడాలంటే సాగుకు సాంకేతికత తోడవ్వాలి. అంతేకాదు, కర్షకుల చిరకాల స్వప్నమైన పండించిన పంటకు ధరలు తామే నిర్ణయించుకునే స్థితి వస్తేనే వ్యవసాయం సస్యశామలమై అన్నదాతల ఆదాయం పెరుగుతుంది. దేశం సుభిక్షంగా వర్ధిల్లుతుంది.

## నిరుద్యోగుల సమస్యలపై

# నోరు మెదపరేం?



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే విద్యారంగం భ్రష్టుపట్టిపోయింది. గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కలుషితాహారం తిని ప్రాణాలు కోల్పోతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో గురుకులాల్లో సీటు రావటాన్ని గొప్పగా భావించిన తల్లిదండ్రులు ఇప్పుడు మాత్రం వాటి పేరు ఎత్తితేనే భయపడతున్నారు. రాష్ట్రంలో ఏదో ఒకచోట కలుషితాహారం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురవటం పరిపాటిగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన విద్య అందించటం వల్ల గురుకులాల విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షా పోటీల్లో విజయం సాధించారు. ఆ స్ఫూర్తిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా దెబ్బతీసింది. బడ్జెట్ కేటాయింపుల్లో మిగతా రాష్ట్రాలు విద్యారంగానికి సగటున 14.8 శాతం నిధులు కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందులో సగం అంటే 7.6 శాతం మాత్రమే కేటాయించింది. బలమైన జాతిని నిర్మించటానికి నేటి విద్యార్థులే ముఖ్యమన్న విషయాన్ని ఈ ప్రభుత్వం మర్చిపోయింది. అధికారంలోకి వస్తే ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలిస్తామన్న రేవంత్ రెడ్డి%ఔ% ఇప్పటివరకు గత ప్రభుత్వంలో వచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రాలు ఇవ్వటానికే పరిమితమయ్యారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల నియామకాలు పూర్తి చేస్తామన్న ఆయన ఇప్పుడు మాత్రం 30 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్లు విడుదల చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ లాంటి వారిని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ గల్లీల్లో తిప్పి మరీ ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులు ప్రస్తుతం నియామకాల మీద నోరు మెదపట్లేదు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని హామీలు కాగితాల మీదే మిగిలిపోయాయి. తెలంగాణ డిగ్రీ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఇవ్వాల్సిన రూ.5,900 కోట్ల బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. రేవంత్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నాణ్యమైన విద్యను విద్యార్థులు అందుకోలేకపోతున్నారు. ఈ సంవత్సర కాలంలో చాలా కాలేజీలు మూతపడటం రాష్ట్రంలోని విద్యారంగం దుస్థితికి నిదర్శనం. గత పదేండ్లలో తెలంగాణలో విద్యాసంస్థల సంఖ్య భారీగా పెరగగా.. ఈ ఒక్క ఏడాదిలోనే అనేక ఫార్మా, డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలు మూతపడ్డాయి. వాటికి రావాల్సిన బకాయిలను విడుదల చేయటంలో రేవంత్ ప్రభుత్వం చేస్తున్న తాత్సారమే దీనికి కారణం.

జాతీయ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్‌లో తెలంగాణ నుంచి ఏ ఒక్క ప్రభుత్వ విశ్వవిద్యాలయం కూడా టాప్- 100లో స్థానం పొందలేకపోయింది. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించే పరిస్థితి లేదు. ఇక సర్వశిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న సిబ్బంది కూడా సమ్మె బాటపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు మెస్ ఫీజులను విడుదల చేయటానికి కూడా రేవంత్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. సుమారు 13 లక్షల మంది విద్యార్థులు తమకు రావాల్సిన స్కాలర్‌షిప్ కోసం ఎదురుచూస్తున్నారు. అధికారపేక్షతో అలవికాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలకమైన విద్యా శాఖను భ్రష్టుపట్టిస్తున్నది. ఇప్పటి వరకు విద్యా శాఖ మంత్రిని నియమించకుండా ముఖ్యమంత్రి తన దగ్గరే ఆ శాఖను ఉంచుకోవటం సరికాదు. ఇప్పటికైనా సమర్థులకు ఆ శాఖను కేటాయించి విద్యా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను తిరిగి అమల్లోకి తీసుకువస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పెండింగ్ డీఏలను విడుదల చేయాల్సి ఉన్నా పట్టించుకోవట్లేదు. ఉద్యోగులు 51 శాతం ఫిట్‌మెంట్ బెనిఫిట్ కోసం ఎదురుచూస్తున్నారు. హెల్త్‌కార్డులు, బీమా సౌకర్యాలు సరిగా అందట్లేదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నా ఈ ప్రభుత్వం ఏ మాత్రం కనికరం చూపించట్లేదు. గత ప్రభుత్వంపై నిరాధర ఆరోపణలు చేసి పదవులు పొందిన నాయకులు ఇప్పుడు విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై నోరు మెదపట్లేదు. ఇప్పటికైనా తెలంగాణ బుద్ధిజీవులు, విద్యావేత్తలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉన్నది.

# మారుపాకలో బాల్య మధురిమలు



నా చిన్ననాటి జ్ఞాపకాలు, వేములవాడ మండలం మారుపాక గ్రామం - కోనరావుపేట మండలం నాగారం గ్రామాల నుండి మొదలవుతాయి. అందులో మారుపాకలో మా కుటుంబం నివసించిన ఊరి ఆవలి గుడిసె ప్రత్యేకం. మాకు రెండు గ్రామాలలో ఆస్తులు ఉన్నాయి. పంచుకుంటే మారుపాకలో ఇళ్లు (గడీ) రాలేదు. అందుకే ఊరి బయట గుడిసెలో కాలం గడిపి నాగారంలో ఒక చిన్న ఇల్లు కట్టారు. అయితే మా తాత గారు (అమ్మ తండ్రిగారు) ఇంటి నిర్మాణానికి బాగా సహాయం చేశారని చెబుతుండేవారు. ఆ గ్రామం పెద్ద అడవిలో ఉండేది కాబట్టి ఎక్కువ కాలం మారుపాకలో గుడిసెలోనే కాలం గడిచిపోయింది. కానీ చివరికి నాన్న నాగారంలోనే చనిపోవడం జరిగింది. అందుకే ఆ గ్రామాన్నే నా వ్యవసాయ క్షేత్రంగా ఎంచుకున్నాను. ఎన్నిసార్లో ఆ గ్రామాన్ని వదిలిపెట్టే పరిస్థితులు వచ్చినా నన్ను మాత్రం వెంటాడి తిరిగి గ్రామానికి తెచ్చుకున్నది నాగారం గ్రామం. ఆ అనుబంధం కూడా చెరిగిపోనిది. ఆర్థికంగా ఎంతో నష్టం జరిగినా సంతోషంగా భరించాను. నా సమయం వృథా అయినా, ఎంతో మంది తీవ్రమైన విమర్శలు చేసినా నాకు మాత్రం సంతృప్తినిచ్చింది నాగారం. మారుపాక గుడిసెలలో పొద్దున్నుంచి రాత్రి పడుకునే వరకు దోమలు, ఈగలు, కోళ్లు, పశువులు, లేగదూడలు, చెట్లు, చేమలు, పువ్వులు, పొదలు, పురుగులు దాదాపు వెన్నంటే ఉండేవి. అప్పుడప్పుడు తేళ్లు, పాములు దర్శనమిచ్చేవి. చాలా వరకు పారిపోయేవి. దొరికిన వాటిని చంపేవారు. అప్పుడు సినిమాలు, టీవీలు లేవు కాబట్టి సమయం అంతా పరిసరాల కమనీయ దృశ్యాలే కంటి నిండ కదలాడేవి. వర్షాకాలం రాగానే ముళ్ల కంపతో గుడిసె చుట్టూ కొంచెం ఎత్తుతో గోడ మాదిరి నిర్మాణం చేసి, చిన్నగా దాన్ని ఒక చోట వదిలి కట్టెలలో చిన్న తలుపు మాదిరిగా అడ్డం ఉంచేవారు. మా గుడిసెకు తలుపు, తాళం లేదని గర్వంగా రాసుకుంటున్నాను. ముళ్లకంప పైన రకరకాల మొక్కలు తీగలు పారి పువ్వులు పూసి, కాయలు కాసి కంపను కనపడకుండా దాచేవి. గుడిసె చుట్టూ అల్లుకుపోయిన పచ్చదనం, పువ్వుల అందం కొన్ని మాసాలు అద్భుతంగా ఉండేది. విద్యుత్ లేదు కాబట్టి రాత్రి కిరోసిన్ నూనెతో ఎక్కాలను, ఖందిల్లను వెలిగించేవారు. సాయంత్రం అయితేనే ఇది ఒక పెద్దపని. రాత్రిపూట మసిబడ్డ బుగ్గలను తుడవడం, కాలిన వత్తులను సరిచేయడం జాగ్రత్తగా నూనె పోయడం ఒక నైపుణ్యంతో కూడుకున్న పని. ఇంటి ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉన్న గూళ్లల్లో మట్టి ప్రమిదలలో నూనె పోసి ఇంట్లో దూదితో తయారుచేసిన వత్తులను వెలిగించేవారు. దేవుళ్ళ దగ్గర మట్టి మాణిక్యాలను వెలిగించేవారు. ఇవన్ని ఉన్నా ఎక్కువ సమయం చీకట్లోనే గడిచేది. వెన్నెల రాత్రులు ఎప్పుడెప్పుడని ఎదురుచూసేవాళ్లము. పంకాలు లేవు కాబట్టి ఉడకపోసినా సహజంగా అనిపించేది. వానకాలంలో కంపనాటడం, ఎండకాలంలో తీయడం, ఒక పెద్ద ప్రక్రియ. కంప తీయటానికి ఉపయోగించే రాగోల (పంగలాంటి పెద్ద కట్టె) పనితనం ఆకర్షణీయంగా ఉండేది. రాత్రిపూట చలికాలంలో గుడిసె ముందు కట్టెలు కాల్చి మంట పెట్టేవారు. అందులో ఒక పెద్ద మొద్దు ఎప్పుడూ మెల్లమెల్లగా కాలుతూనే ఉండేది. అవసరం అయినప్పుడు దాని పైననే ఎండిన పుల్లలు, ఒక చిన్న కంప, ఆకులు వేసి ఊదితే కొంతసేపు చలి కాపుకునే మంట వచ్చేది. దాని చుట్టు గుండ్రంగా కూర్చునేవారము. గుడిసె ముందు రోలు, రోకలి, గుడిసె లోపల కాగులు, కుండలు, కూజాలు, గిలాసలు, చెంబులు, గంగాలాలు, కొప్పెరలు, దేకీసలు, పొయ్యిలు, దాలి, శిబ్బి, కవ్వం, వేలాడుతున్న ఉట్లు, చల్ల కుండ, పల్లాలు, కూర్చుండే చాపలు, పండుకునే చాపలు, మంచాలు, పరుపులు, దుప్పట్లు, మెత్తలు, జంబుకానాలు, తెల్లవారంగానే బట్టలను చుట్టి ఒక్కొక్కదాన్ని గడెంచ మీద పేర్చేవారు. అల్మారాలు మాత్రం ఉండేవి కావు. మా నాన్న నవారు మంచం మీద, మిగిలిన వారందరం నులక మంచాల మీద, చాపల మీద పండుకునేవారం. పొద్దున లేవంగానే బొగ్గు పొడితో అందరం పండ్లు తోముకునేది. మా నాన్నగారు పండ్ల పుల్ల వేసుకునేది. పండ్ల పుల్లలు కట్టలుగా ఉంచేవారు. అందులో కొన్న యాప పుల్లలు, మధ్యలో ముద్రబెండ చెట్ల పుల్లలు ఉండేవి. అప్పుడప్పుడు అవి వేసుకొని మా గొప్పతనాన్ని ఎవరికీ తెలియకుండా చాటుకునేవారం. ఆ కాలం నుండే టీ త్రాగుటం అందరికి అలవాటు అయ్యింది. "దాలి" అనేది వంటింట్లో భూమిలో రెండు, మూడు అడుగుల లోతున చతురస్రాకారంలో త్రవ్వి దానిలో పిడకలు వేసి, పైన కుండ పెట్టి దానిలో పాలు పోసి, పిడకలకు నిప్పంటిస్తే అది పొద్దుటి నుండి మధ్యాహ్నం వరకు మెల్లమెల్లగా కాగుతుండేది. కుండకు ఒక శిబ్బి (మేదరి వాళ్లు అల్లినవి) అడ్డంగా మూత మాదిరి పెట్టేది. మొత్తం దాలిపైన సందులుగా కట్టెతో చేసిన తలుపుతో మొత్తం దానిని మూసేది. దానిని దాలిపైన ఉండే జాలి అని పిలిచేవారు. అది ఒక కట్టె కిటికిగా ఉండేది. పాలు పొంగి, మెల్లమెల్లగా కాగుతుండేవి. వేడి మాత్రం శిబ్బి నుండి బయటకు పోయేది. మధ్యాహ్నం పాలు గోధుమ రంగు వచ్చేంత వరకు కాగిన తర్వాత, తీసేసి చల్లార్చి తోడు పెట్టేవారు. ఈ కుండను ఉట్టిమీద పెట్టేవారు. పాలమీది మీగడకు ఒక అద్భుతమైన రుచి, పెరుగైన తర్వాత కూడా ఈ మీగడ మరొక రకమైన రుచినిస్తుంది. పాలు కాగిన తరువాత వాటినే తోడుకని వేరే కుండలో పోసినప్పుడు వేడికి అడుగంటిన పాలు గోధుమ రంగుతో కుండకు అతుక్కుపోయి ఉండేది. దాన్ని కైశిప్ప (కష్కే)తో రాకి తీసిన దాన్ని గోకు అనేవారు. కొన్ని చెంచాలు మాత్రమే వచ్చే దీన్ని చెక్కరలో కలుపుకొని పిల్లలు తినేవారు. నల్ల తుమ్మ చెట్ల పొదలలో పూసిన పసుపు పచ్చని పువ్వులు ఇంటి చుట్టూ ఉండేవి. ఎక్కడ పడితే అక్కడ పాకిన కట్లె పూవులు, గన్నేరు, మల్లె, ఆకాశ మల్లెపూలు వాటి వాసన అద్భుతంగా ఉండేది. బంతిపూలు, చామంతి, నందివర్ధన పూవులు, గునుక, తంగేడు, మందారం తదితర పూవులు బతుకమ్మ పండుగ నాడు ప్రతి ఇంట్లో చేరేవి. గునుక పూవులకు రకరకాల రంగులు వేసి వరుసలుగా పేర్చి వాటి మధ్యన తంగేడు ఇతర పూవుల వరుసలతో గుండ్రంగా బతుకమ్మను పేర్చేవారు. ఊరిలో ఎవరి బతుకమ్మ పెద్దది అనే చర్చ కొన్ని రోజులు నడిచేది. సద్దుల బతుకమ్మనాడు ఊరి చెరువులో బతుకమ్మలను విడిచేవారు. ఈ పండుగనాడు మహిళలు దాదాపు అన్ని కులాలవారు కలిసిమెలిసి గుండ్రంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడడం చరిత్రాత్మకం. చివరగా అందరూ తెచ్చుకున్న పిండివంటల పంపకాలు ఆహ్లాదకరంగా ఉండేది. ఈ పండుగలు తెలంగాణా వారు ఎక్కువ ఉన్న ఇతర రాష్ట్రాలు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక తదితర ప్రాంతాల్లో కూడా జరుగుతుండేవి. ఇప్పుడు ప్రత్యేక తెలంగాణా ఉద్యమ సందర్భంగా దీని ప్రచారం ఎక్కువై ప్రపంచంలోని చాలా దేశాల్లో బతుకమ్మ ఆటలు మహిళలు ఆడి%-%పాడి ప్రత్యేక తెలంగాణా ఆకాంక్షను తెలియజేశారు. నేలరాలిన మోదుగు పూవులను ఏరుకొని రంగులను తయారు చేసుకునేవారం. ఇప్ప పూవులను ఏరుకునేవారం. కొన్నిసార్లు వేకువజామున గ్రామ ప్రజలు, మహిళలు ఇప్ప పూవులను ఏరుకునే సందర్భంలో ఎలుగుబంట్ల దాడులకు గురయ్యేవారు. మల్లెపూలల్లో బొడ్డుమల్లె, సన్నజాజి మల్లె ఇంకా రకరకాల మల్లె పూలను పిచ్చిగా ప్రేమించేవాడిని. వాటిని నా జేబులో వేసుకోవడం రాత్రి మంచంలో పరచుకోవడం, పడుకొని ఆకాశంలో నక్షత్రాలను, మేఘాలను, చంద్రుని చూస్తూ నిద్రలోకి జారుకోవడం దినచర్యగా ఉండేది. మా బాపు (నాన్న) తోట్లోకి పోయేటప్పుడు చేతిలో కర్రా, రూమి టోపీ పెట్టుకునేవాడు. ఇంటికి వచ్చిన తరువాత టోపీ తీస్తే అందులో దాచిన ఎన్నో మల్లెలు కిందపడితే వాటిని ఏరుకునేవారం, నవ్వుకునేవారం, మా నాన్నగారు కూడా సంతోషంగా ఉండడం అప్పుడే చూసేది. మా నాన్నగారితో కలిసి ఉండే క్షణాలు అసలు జ్ఞాపకమే లేవు. ఎప్పుడూ దూరంగానే ఉండేది. పూజ చేసుకుంటున్నప్పుడు మాత్రం మేము ముందర కూర్చుండేవారం. వారు కళ్ళు మూసుకొని జపం చేస్తున్నప్పుడు మేము కళ్ళు తెరుచుకొని కొబ్బరి ముక్కలు చెక్కర కలిపిన పలహారం వైపు చూస్తుండేవారం. మాకు పలహారం పెట్టిన తరువాత పరుగు తీసేవారం. నాకు ఒక చిత్రమైన ఆలోచన ఉండేది. మా నాన్న ఎప్పుడైనా పనిమీద ఏదైనా ఊరికి పోతారా అని ఎదురుచూసేవారం. ఆనాడే మాకు ఆడినంత ఆట, పాడినంత పాట.

# అవయవ లోపం ఉన్నోళ్లు కాదు వికలాంగులు వారికి సహాయపడని వారే నిజమైన వికలాంగులు





## దొడ్డప్ప అధ్యక్షతన ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

**గుంతకల్లు డిసెంబర్ 29 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్ నందు శ్రీ పోలేరమ్మ దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షులు టి దొడ్డప్ప సభ అధ్యక్షతన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుత్తి గుంతకల్లు పామిడి ప్రాంతాలకు చెందిన 500 మందికి పైగా దివ్యాంగులు పాల్గొన్నారు. వీరికి ప్లేట్లు గ్లాసులు మరియు 100 రూపాయలు ఇస్తూ భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న గుంతకల్లు ఒకటవ పట్టణ సిఐ మనోహర్,మోటార్ వాహనాల తనిఖీ అధికారి రాజా బాబు,జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్ యాదవ్ పాల్గొని ప్రసంగిస్తూ దొడ్డప్ప నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అమోఘమని పేర్కొన్నారు. అంగవైకల్యం అనేది మనిషికే కానీ మనసుకు కాదని సహజంగా సకలాంగుల కంటే విభిన్న ప్రతిభావంతులకు మానసిక స్థితి దృఢంగా ఉంటుందని వికలాంగులకు అవసరమైన తోడ్పాటు అందిస్తే ఎటువంటి విజయనైనా సాధించగలర ని వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం వికలాంగుల హక్కుల చట్టం 2016ను రూపొందించిందని వికలాంగులపై ఎవరైనా వివక్షత చులకన చూపిన వారిని నిర్లక్ష్యం చేసిన సెక్షన్ 92 ప్రకారం కేసు నమోదు చేస్తారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు దాత మేస్త్రి దొడ్డప్ప ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఒకటవ పట్టణ ఎస్ఐ కొండయ్య,రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాఘవేంద్రప్ప, కసాపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగం గా సమాజ సేవకులు చిట్టి బాబు, మల్లికార్జున,షేక్షావలి,బ్లడ్ తోవి బసవ,తోవి విజయ్ ఎస్కే సయ్యద్ పీరా, టీచర్ మల్లికార్జున,టీచర్ పంపపతి, వికలాంగుల సంఘం అధ్యక్షుడు మిమిక్రీ కళాకారుడు లింగమూర్తి, పద్మ తదితరులు సత్కరించడం జరిగింది.

# ఎఫ్ సి ఐ గౌడన్లోనే బియ్యం స్టాక్ ఉంచాలి

**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** కేంద్ర .రాష్ట్ర ప్రభుత్వాల ఎఫ్సీఐ గోడన్లు ఉన్నచోట ప్రైవేటు గోడౌన్లు ఉండకూడదు.. అని గవర్నమెంట్ ఆర్డర్ కూడా ఉంది. అయినా కూడా ఎఫ్ సి ఐ గోడంలో ఉండే స్టాక్ ని అలాగే నిల్వ ఉంచి గత ప్రభుత్వం. వాడుకోవడానికి స్థలం ఖాళీ లేదు అనే కారణం చూపించి ప్రైవేట్ గోడాన్లని నిర్వహిస్తున్నారు.ప్రైవేట్ గోడౌన్లలో అధికంగా ఆర్థిక లావాదేవుల ఖర్చులను చూపించి కాంట్రాక్టర్లు లబ్ధి పొందుతున్నారు.నంద్యాల జిల్లా బేతంచర్ల లో ఉండే ప్రైవేట్ గోడను మరియు గుంతకల్ ప్రైవేట్ గోడౌన్ కు సంబంధించిన కాంట్రాక్టర్ ఆ వ్యక్తిని గుంతకల్ ఎఫ్సీఐ గోడెన్ మెయింటెనెన్స్ కి కూడా కాంట్రాక్టర్ తీసుకున్నారు. గత వారంలో బేతంచెర్ల ప్రైవేటు గోడన్లు లో కూడా అవకతవకలు జరిగినా విషయాలన్నీ కూడా మీడియా ద్వారా బయటికి రావడం జరిగింది.గుంతకల్ ప్రైవేటు గోడన్లులో అధిక ఖర్చులు చూపించి లబ్ధి పొందుతున్న కారణంగా ఆ విషయాలన్నీ కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వారు దానికి స్పందించి దానికి సంబంధిత అధికారులతో విచారణ జరిపి సెంట్రల్ %ఖీజ×% గోడన్లని ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై వాళ్లకి అద్దెకు ఇవ్వడానికి రెడీగా ఉన్నారు.కానీ ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై వాళ్లు దాన్ని తీసుకోవడానికి ఇంట్రెస్ట్ చూపియడం లేదు.. దానికి బదులుగా గత ప్రభుత్వం ప్రైవేట్ గోడన్నులని ప్రోత్సహించినారు. ప్రైవేట్ గోడన్లు లను నిర్వహించుకుంటూ




అధిక మొత్తంలో ఆర్థిక లావాదేవులను నడుపుతూ ప్రభుత్వానికి గండి కొడుతున్నారు. అలాకాకుండా రాష్ట్ర ప్రభుత్వమే. మళ్లీ కేంద్ర ప్రభుత్వ ఎఫ్సీఐ గోడన్లని ఆధీనంలోకి తీసుకుని నడపాలని కోరడమైనది.
నాకు వచ్చిన రిప్లై లెటరు మరియు నా తరఫున రిక్వెస్ట్ లెటర్ ని ఆంధ్రప్రదేశ్ పౌరసరపర శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కి పంపించడం జరిగింది. అనంతరం నాదెండ్ల మనోహర్ మీటింగ్ నిర్వహించి డిసెంబర్ 23వ తారీకు గైడెన్స్ లను పాస్ చేసి అన్ని డివిజనల్ అధికారులకు పంపించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ గౌడన్లు నే వాడుకోవాలి ప్రైవేట్ గోడౌన్లను నిర్వహించకూడదు అని ఆర్డర్స్ ఇవ్వడం జరిగింది.
అనంతపురం జిల్లా కలెక్టర్ కి మరియు ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ కి మరియు సివిల్ సప్లై డిస్టిక్ మేనేజర్ రమేష్ రెడ్డి కి ఈ విషయాలన్నీ వారి దృష్టికి తీసుకెళ్లి..వివరించి. చర్చించి ఈ ఆర్డర్స్ అమలు చేయాలని కోరడం జరిగింది. ఈ విషయం పైన ఎంపీ వెంటనే స్పందించి ఆయన పౌర శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ కి ప్రత్యక్షంగా వారితో మాట్లాడి ఎఫ్ సి ఐ గోడాన్లని ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై వాళు తీసుకొని వాడుకునేటట్టు హామీ ఇచ్చారు.
గతంలో %ఖీఎఱ% గోడాన్లు ,రాష్ట్ర ప్రభుత్వము ఆధీనంలో నడిపేవారు 2022 వరకు. అప్పుడు భారత దేశంలోనే గుంతకల్ ఎఫ్ సి ఐ గోడన్ నిర్వాహణలో రెండో స్థానం ట్రాక్ రికార్డు ఏర్పడింది.
కరోనా సమయంలో కూడా అమాలీలు ఎక్కడ లేని విధంగా నెలకు రెండు మార్లు రాత్రి పగళ్ళు కష్టపడి 24 గంటలు స్టాక్ పాయింటులకు సరుకులు అందిస్తూ, ఆరు సంవత్సరాలు ..తక్కువ కూలీలతోనే అమాలీలు కష్టపడి పని చేశారు మరియు గుంతకల్ ఎఫ్సీఐ గోడాన్ లో బియ్యం సంచు లో బియ్యం తూకం లో అవకతవకలు జరగకుండ చూడాలని భారత దేశంలోనే ఇక్కడ నుండి కార్మికులే దీన్ని మొట్టమొదటి సారి ప్రారంభించి ట్రాక్ రికార్డ్ చేశారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వము గుర్తించి గుంతకల్ ఎఫ్సీఐ గోడనల్లని, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధీనంలోకి తీసుకొని వాడుకోవడం వల్ల ప్రత్యక్షంగా ...పరోక్షంగా.. 2000 కుటుంబాలకు ఆదుకొని వారికి జీవనోపాధి కల్పించవలసిందిగా కోరడమైనది.

# మహేంద్ర టాలెంట్ టెస్ట్ విజేతలకు శాసనపురి కామేశ్వరరావు మాష్టారు ప్రతిభ పురస్కారాలు








**పాతపట్నం డిసెంబర్29, ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం మహేంద్ర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మహేంద్ర టాలెంట్ టెస్ట్ లో 36 ఉన్నత పాఠశాలల నుండి638 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి అమర జ్యోతి స్కూల్ కి చెందిన కాళ్ల తనూశ్రీ కి 3000 రూపాయలు నగదు బహుమతి, షీల్డ్ మరియు సర్టిఫికెట్ ,ప్రభుత్వ ఉన్నత పాఠశాల రొంపివలస కు చెందిన పి ధనుష్ కు ద్వితీయ బహుమతిగా 2000 రూపాయల నగదు, షీల్డ్ మరియు సర్టిఫికెట్, పాతపట్నం విజ్ఞాన్ స్కూల్ కు చెందిన కొమరపు మేఘనా మోహన్ కు తృతీయ బహుమతి గా 1500 రూపాయల నగదు, షీల్డ్ మరియు సర్టిఫికెట్.. వీరితోపాటు మరో 5 మందికి కన్సోలేషన్ బహుమతులుగా వెయ్యి చొప్పున శాసనపురి కామేశ్వరరావు మాస్టర్ ప్రతిభ పురస్కారాలు ప్రకటించడం జరిగింది. వీరికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నేత్ర వైద్యులు ప్రదీప్ కుమార్ స్వైన్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం జరిగింది. అంతకుముందు ఇటీవల స్వర్గస్తులైన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పటానికి పూలమాలవేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. సభాధ్యక్షులుగా వ్యవహరించిన డాక్టర్ శాసనపురి మధుబాబు పోటీ పరీక్షల ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారుఈకార్యక్రమంలో కార్యక్రమ కర్త శాసనపురి కామేశ్వరరావు మాస్టర్, టాలెంట్ టెస్ట్
కన్వీనర్.ఎం.ఆంజనేయులు,అనుమంచుపల్లి.రాజగోపాలాచార్యులు,బి.వి.రమణ,రమేష్ తదితరులు పాల్గొన్నారు..

## అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి



**మెలియాపుట్టి ప్రజా జ్యోతి డిసెంబర్ 29:** రాష్ట్రంలో అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని జిల్లా విజిలెన్స్ అండ్ మోనెటరింగ్ కమిటీ మెంబర్, ఓ.వి.పేట నీటిసంఘం అధ్యక్షులు, కళింగ గ్లోబల్ ఫెడరేషన్ అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు పేర్కొన్నారు. ఆదివారం బూర్జ మండలం ఓ.వి.పేట గ్రామంలో బీటీ రహదారి పనులను ఆయన పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని సిబ్బందికి సూచించారు. లచ్చయ్యపేట నుండి ఓ.వి.పేట రహదారి, ఓ.వి.పేట నుండి ఉప్పినివలస రహదారులకు మరమ్మతు పనులు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో రాకెట్ వేగంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. అందుకు సుపరిపాలన అందిస్తున్న స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. స్థానిక ఎంపీటీసీ, బూర్జ వైస్.ఎంపిపి బుడుమూరు సూర్యారావు మాట్లాడుతూ ఈరహదారి పనులు మూలంగా లచ్చయ్యపేట, కంట్లం, చీడివలస, ఓ.వి.పేట, ఒపివాడ, హనుమయ్యపేట, జంగాలపేట, ఉప్పినివలస గ్రామాల ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. నారాయణపురం ఏడమకాలువ నీటిసంఘం వైస్.చైర్మన్ బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ గడచిన వైసీపీ ప్రభుత్వం పూర్తిగా రహదారులను పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు

## గుత్తిలో ఘనంగా ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం



**గుంతకల్లు డిసెంబర్ 29 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గుత్తి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ లో పతాకావిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు సి రమేష్ ,పక్కన బాలాజీ మాట్లాడుతూ 1970లో తిరువనంతపురం లో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ 54 సంవత్సరాలు పూర్తి చేసుకుని నేటితో 55వ వసంతం లోకి అడుగు పెడుతుందని తెలిపారు. ఈ 55 ఏళ్ల ప్రస్థానంలో అనేక త్యాగాలు,అనేక పోరాటాల తో ఈదేశ పోరాట చరిత్రలో తన గూర్చి సువర్ణ అక్షరాలతో లిఖించగలిగిందన్నారు. దేహం ముక్కలైన దేశాన్ని ముక్కలు కానివ్వనని చెప్పి తన ప్రాణాలను దేశం కోసం తృణ ప్రాయంగా అర్పించిన 8 వ తరగతి విద్యార్థి నిరంజన్ తాలూక్ దార్ స్ఫూర్తితో నేటికీ అలుపెరుగని పోరాటాలు సాగిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో స్కాలర్ షిప్స్ సాధన,ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు కోసం,సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు కల్పన కోసం ఎన్నో పోరాటాలు చేసి వాటిని సాధించుకోగలిగామ ని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై 55వ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలు రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు నవీన్ యాదవ్, షేక్షావలి,కె.రాజు, వాసు,రాహుల్,మురళి పాల్గొన్నారు.

## కార్మికులకు అన్యాయం జరిగితే న్యాయం చేసేంతవరకు పోరాటం చేసేది ఎర్రజెండా మాత్రమే: సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్

### గుత్తి సిపిఐ కార్యాలయంలో ఘనంగా సిపిఐ శతజయంతి ఆవిర్భావ వేడుకలు




**గుంతకల్లు డిసెంబర్ 29 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** గుత్తి పట్టణంలోని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) కార్యాలయంలో సిపిఐ 100 సంవత్సరాల శతజయంతి ఆవిర్భావ వేడుకల సందర్భంగా పార్టీ కార్యాలయం నుండి గాంధీ చౌక్ ,బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సీపీఐ కార్యాలయం ముందు సభను నిర్వహించడం జరిగింది. సీపీఐ పట్టం కార్యదర్శి రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ జగదీష్,అనంతపురం సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, కార్యవర్గ సభ్యులు గోవిందు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి పాల్గొని కామ్రేడ్ జగదీష్ జండా ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ భారతదేశంలోని ప్రజలకు కార్మికులకు కర్షకులకు ఉద్యోగస్తులకు ఉపాధ్యాయు లకు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఎర్రజెండా ముందుండి వారికి న్యాయం చేసేంతవరకు పోరాడుతుంద ని అలాంటి పార్టీలో మనం సభ్యులుగా ఉన్నందుకు చాలా గర్వించదగ్గ విషయం మన పెద్దలు అందించిన విప్లవ ఉద్యమాలను ముందుకు తీసుకుని పోయి ప్రజలందరికీ న్యాయం జరిగేంత వరకు నిరంతర పోరాటం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమ%శీ% లో రామదాస్ సిపిఐ గుంతకల్లు నియోజకవ ర్గ సహాయ కార్యదర్శి దర్శిలు మహేష్, రమేష్,మండల సహాయ కార్యదర్శి మధుసూదన్ రావు,నజీర్, గుంతకల్లు సిపిఐ పట్టణ ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము రాయల్,రామంజి,ఎస్.ఎం.డి గౌస్,ఏఐఎస్ఎఫ్ వెంకట్ నాయక్,నాయకులు రామంజి,మల్లికార్జున,మహిళా సంఘం నాయకురాలు మహమ్మదా,మహబూబ్ తదిరులు పాల్గొనడం జరిగింది.

# ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని వినతి

గుంటూరు నాగార్జున యూనివర్సిటీ లో ఎస్ ఏ పి చైర్మన్ రవి నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మౌంటరింగ్ కమిటీ మెంబర్ సాకే గోవింద్

**గుంతకల్లు డిసెంబర్ 29 ప్రజా జ్యోతి ప్రతినిధి (అనందరాజు):** గుంటూరు నాగార్జున యూనివర్సిటీ లో ఎస్ ఏ పి చైర్మన్ రవి నాయుడుని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మౌంటరింగ్ కమిటీ మెంబర్ సాకే గోవింద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ఉన్నటువంటి క్రీడాకారులకు కొన్ని సంవత్సరాలగా స్పోర్ట్స్ అఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంతవరకు పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయకుండా ఉన్న కోచులతోనే సర్దుబాటు చేసుకుంటూ ఉన్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ఎన్ ఐ ఎస్ చేసినటువంటి వారికి కోచ్ పోస్టులు విడుదల చేయాలని,ఒలంపిక్స్ లో ఆంధ్రప్రదేశ్ లో 29 గేమ్లున్నాయి ప్రతి గేములోనూ ఎనైజ్ చేసిన వారు ఉన్నారు.కాబట్టి తొందరలో ఉద్యోగాల ఖాళీల కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్లో ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని,జూడో క్రీడాకారులకు అభివృద్ధికి కృషి చేయాలని రవి నాయుడు కి గోవిందు తెలియజేయడం జరిగింది.



# దళిత ఎంపీడీవో పై వైసీపీ నేతలు చేసిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన ర్యాలీ







**గుంతకల్లు డిసెంబర్ 29 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** అన్నమయ్య జిల్లా గాలివీడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జవహర్ బాబు పై వైసీపీ నేతలు చేసిన దాడిని ఖండిస్తూ ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేష్,ఎల్లిపాయల ఆనంద్ ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్ నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధులలో ఉన్న ఎంపీడీవో జవహర్ బాబు పై వైసీపీ నేత సుదర్శన్ రెడ్డి దాడి చేయడం దుర్మార్గమని ఈ దాడి పైన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించకపోవడం వైసీపీ నాయకులకు చట్టాల పట్ల గాని దళితుల పట్ల గాని గౌరవం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం దళితులకు ప్రత్యేకంగా దళిత ఉద్యోగులకు రక్షణ కల్పించా లన్నారు. జోహార్ బాబు పై దాడిని పవన్ కళ్యాణ్ ఖండిస్తూ,ప్రభుత్వం తరఫున వారి కుటుంబానికి భరోసా కల్పిస్తూ,జోహార్ బాబును పరామర్శించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అరుణ్,రాజా, రఘు,మహేష్,నావెల్,బబ్లు, రాజు,శ్రీనివాస్, కిరణ్,పోలా సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు





**పొందూరు , డిసెంబర్ 29:** ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు పొందూరు మండలం కింతలి గ్రామంలో గత రెండు రోజులుగా సర్పంచ్ పైడి రాం ప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అనుసరిస్తున్న విధానాలకు ఆకర్షితులై అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా ప్రజలు తరలివచ్చి సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం , పేదల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. బడుగు , బలహీన వర్గాలతో పాటు దిగువ , మధ్య తరగతి కుటుంబాలలో ఉన్న వారికి అండగా ఉండేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. సభ్యత్వం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాన్ని వివరించారు. ఈ రెండు రోజులు చేపట్టిన సభ్యత్వ నమోదు లో 520 మంది సభ్యత్వం నమోదు చేయించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కూటి కుప్పల , హనుమంతు రావు,మాజీ సర్పంచ్ ధవళ గణపతి , కూన శ్రీనివాస రావు , సింగూరు రాజశేఖర్ , పొన్నాడ నాగేశ్వర రావు , ఎ ప్రసాద్ ,నాయకులు , కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలు జగన్ మానుకోవాలి.ఎమ్మెల్యే పితాని.



**పోడూరు. డిసెంబర్ 29,ప్రజాజ్యోతి న్యూస్** కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని జగన్ అబద్ధపు ప్రచారం అపహాస్యంగా కనిపిస్తుంది ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో అయన పార్టీకార్యాలయంలో ఆదివారంపాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో %ూ% నుండి 50 యూనిట్స్ కి 1.45 పైసలు చేస్తే వైసీపీ ప్రభుత్వంలో 1.9 పైసలు చేశారన్నారు.అదే 50 నుండి 100 యూనిట్స్ కు కు 2.60 పైసలు ఉంటే వైసీపీ ప్రభుత్వం 3 రూ"లకు పెంచిందన్నారు.యూనిట్ చార్జీలను దఫదపాలుగా పెంచిన ఘనత జగన్మోహన్ రెడ్డి దే అన్నారు.ఇప్పుడు కూటమి ప్రభుత్వం అదే చార్జీలను అమలు చేస్తున్న విద్యుత్ చార్జీలను పెంచారని అబద్ధపు ప్రచారంతో వైసీపీ రోడ్లు ఎక్కడం దురదృష్టకరం అన్నారు.అబద్ధాల మహారాజు జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే డబ్బులు కోసం పవర్ పర్చేజ్ అగ్రిమెంట్స్ చేసుకొన్నాడన్నారు.కేంద్ర ప్రభుత్వం హెచ్చరించిన పి పి ఏ అగ్రిమెంట్స్ చేసిన ఘనుడు జగనే అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచారని వైసిపి ధర్నాలు, నిరసనలు చేస్తే ప్రజలు నమ్ముతారా? అని ప్రశ్నించారు.మీ ప్రభుత్వంలో 8 సార్లు 2019 నుండి 2024 వరుకు విద్యుత్ చార్జీలు పెంచారున్నారు. విద్యుత్ చార్జీల భారం 36వేల166కోట్లు గత 5 సంవత్సరాలలో విద్యుత్ సంస్థలపై పెరిగిన అప్పులు 49వేల 596 కోట్లు అని మొత్తం 81వేల 768 కోట్లు ప్రజలపై భారం పడిందన్నారు.నేను చెప్తుంది నిరాధారం అని చెప్పడానికి మీకు దమ్ము ధైర్యం ఉందా అని అయన సవాల్ విసిరారు.గత ప్రభుత్వం విద్యుత్ స్కాం నిర్వహణ వైఫల్యం పై 618 కోట్లు గా కూటమి ప్రభుత్వం అంచనా వేస్తుంది తెలిపారు.

## విద్యుత్ ఛార్జీల పెంచిన పాపం జగన్ రెడ్డిదే

మీరే చార్జీలు పెంచి,మీరే ధర్నాలు చేయడం,ప్రజలను మోసం చేయడమే కాదా... ఎమ్మెల్యే ఎంజీఆర్.

వైసిపి ప్రభుత్వం చేసిన పాపం కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది.

జగన్ అవినీతి వల్లే రూ.1,29,000 కోట్ల విద్యుత్ భారాలు



గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో చేసిన తప్పులు వల్లే విధ్యుత్ చార్జీల పెంపునకు కారణమని,విధ్యుత్ చార్జీలు పెంపు పాపం జగన్ రెడ్డిదేనని పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు అన్నాను. గత ఐదేళ్లులో విధ్యుత్ కొనుగోలు,ఇందుకు సంభందించిన విషయాల్లో జగన్ చేసిన అవినీతి వల్లే రాష్ట్రంలో రూ. 1,29,000 కోట్లు విద్యుత్ భారాలు ప్రజలపై విధ్యుత్ ఉత్పత్తి సంస్థల పై పడ్డాయని ఆయన ఆరోపించారు. వైకాపా ప్రభుత్వం సమయంలో గత పాలకులు చేసిన పాపాలు ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాపాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 2019-24 మధ్య అవగానలేని పరిపాలన వల్ల రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. 2019లో తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే సమయానికి మిగులు కరెంటుతో రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డ

## యువనేత తమ్మినేని చిరంజీవి నాగ్కు ఎమ్మెల్సీ బొత్స పరామర్శ



**పొందూరు (ఆమదాలవలస) , డిసెంబర్ 29 :** మాజీ సభాపతి, వైయస్సార్ సిపి శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం పరిశీలకులు తమ్మినేని సీతారాం తనయుడు యువనేత చిరంజీవి నాగ్ కు,ఇటీవల హైదరాబాదులో శస్త్ర చికిత్స జరిగిన విషయం విధితమే. రెండు రోజుల క్రితం స్వగృహం ఆముదాలవలస కు చేరుకున్న చిరంజీవి నాగ్ ను,శాసనమండలి విపక్ష నేత ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆదివారం పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మునుపటిలా ప్రజాక్షేత్రంలో పార్టీ కార్యక్రమాల్లో ముఖ్య భూమిక పోషించాలని కోరారు.ప్రస్తుతం పార్టీ స్థితిగతులు తో పాటు, భవిష్యత్తులో అనుసరించాల్సిన చర్యలు పై,మాజీ సభాపతి తమ్మినేని సీతారాంతో, ఎమ్మెల్సీ బొత్స చర్చించారు. పరామర్శించిన వారిలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యన్నారాయణ , వైఎస్సార్సీపీ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ,రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు, నియోజకవర్గ సమన్వయ కర్త చింతాడ రవికుమార్ ,పొందూరు మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ , ఉప ఎంపీపీ ప్రతినిధి వండాన సూరపు నాయుడు , పెనుబర్తి సర్పంచ్ ప్రతినిధి తమ్మినేని మురళీ కృష్ణ , మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిలాన సూర్యారావు ,నాలుగు మండలాల వైసిపి నాయకులు , కార్యకర్తలు ఉన్నారు

## కూటమి ప్రభుత్వంలో రోడ్లకు మహర్దశ



**చెరుకుపల్లి (ప్రజా జ్యోతి)** చెరుకుపల్లి మండల కేంద్రమైన చెరుకుపల్లి నుంచి బొలుసులు పాలెం పరిసర పాలాల ప్రజలు సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతుండేవారు కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల మరమ్మతులు చేయడం చూసి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు గత ప్రభుత్వంలో రోడ్లు సరిగా లేక స్కూల్ పిల్లలు గ్రామ ప్రజలు ఎంతో ఇబ్బంది పడే వారిని వాపోతున్నారు

## హైందవ శంఖారావం కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం లక్ష రూపాయలు విరాళం



**గుంతకల్లు డిసెంబర్ 29 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** విశ్వ హిందూ పరిషత్ - ఆంధ్రప్రదేశ్ వారు భారతదేశం లోని హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం జనవరి 5 వ తేదీన తలపెట్టి న చలో విజయవాడ - హైందవ శంఖారావం కార్యక్రమము జయప్రదం కావాలి అని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూర్ జయరాం వారి సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి ఆదివారం విశ్వ హిందూ పరిషత్ కమిటీ సభ్యులకు ఒక లక్ష (1,00,000) రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కు నారాయణ స్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కటకటాలే



**బాపట్ల జిల్లా ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్** మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం నేరం ఇది డ్రైవర్ ప్రాణాలను మాత్రమే కాకుండా రహదారిపై ఇతరులకు కూడా ముప్పు కలిగిస్తుందని బాపట్ల డిఎస్పి జి రామాంజనేయులు తెలిపారు ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం తీవ్రమైన నేరమని చెప్పారు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం తాగి వాహనం నడపడం మద్యం సేవించి వాహనం నడపటం వలన ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని సూచించారు వాటిని నివారించడానికి ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని బాపట్ల డిఎస్పి జి రామాంజనేయులు తెలిపారు బాపట్ల పాత బస్టాండ్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వ్యక్తులను బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీలు నిర్వహించారు మద్యం తాగి ఎవరైనా వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి హెచ్చరించారు ఈ తనిఖీల్లో బాపట్ల పట్టణ సీఐ మహమ్మద్ జాని రూరల్ సిఐలు కె శ్రీనివాసరావు బి హరికృష్ణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రత్యేక పూజలో పాల్గొన్న విశ్రాంత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి



**బాపట్ల జిల్లా ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల నియోజకవర్గం పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ బగళాముఖీ అమ్మవారి దేవాలయానికి ఆదివారం దర్శనం కోసం విశ్రాంత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి యన్.వి.రమణ సతీ సమేతంగా వచ్చిన సందర్భంగా వారినిబాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు అనంతరం వారితో కలిసి దేవాలయంలో ప్రత్యేక పూజా లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పిట్టవానిపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అష్టల్ గ్రామ పార్టీ అధ్యక్షులు రజాక్ చందోలు జనసేన మండల పార్టీ అధ్యక్షులు దాదా నియాజీ మరియు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు నియోజకవర్గ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి గుంతకల్ మున్సిపల్ వైస్ చైర్మన్ వై నైరుతి రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు

## వయసు మరచి ఆనందంగా గడిపిన పూర్వ విద్యార్థులు



**బాపట్ల జిల్లా ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ఏబీఎం హై స్కూల్ 1976-77 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ద్వితీయ ఆత్మీయ సమ్మేళనంలో ఎలిషా రావు మాస్టర్ దంపతులకు సన్మానం 1976-77 వ సంవత్సరం పదవ తరగతి ఏబీఎం హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం హై స్కూల్ ఆవరణ లో ద్వితీయ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు ఈ కార్యక్రమం లో అప్పటి గురువులు అయిన ఎలీషా రావు మాస్టర్ ని మరియు రస్మిని సన్మానించారు అనంతరం గత స్మృతులను నెమరు వేసుకుంటూ వారి అనుభవాలు మరియు అనుభూతులు పంచుకున్నారు పూర్వ విద్యార్థులు మాస్టర్లు తమ వయసు మరిచిపోయి ఆనందంగా గడిపారు

## నాలుగవ స్తంభం పాత్రికేయ రంగం ఎమ్మెల్యే సత్యప్రభ



**ప్రత్తిపాడు ప్రజాజ్యోతి రిపోర్టర్ శ్రీను** కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు నాల్గొవ స్థంభంగా పిలువబడే పాత్రికేయ రంగం ఎంతో విలువలతో కూడిన మరియు కత్తి మీద సాము వంటిదని అన్నారు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేసే ఏకైక వ్యవస్థ పాత్రికేయరంగమని అన్నారు ప్రభుత్వాలు చేసే ప్రజోపయోగకర విధానాలను ప్రశంసిస్తూనే ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టే ధైర్యమున్న రంగమని అన్నారు అటువంటి రంగాన్ని ఎంచుకున్న మీరు ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి మాతో పాటు మీరు కూడా తోడ్పాటునందించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు టిడిపి రాష్ట్ర కమిటీ కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణ రాజు ప్రత్తిపాడు మండల టిడిపి అధ్యక్షులు అమరాది వెంకటరావు, ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి నరసింహమూర్తి ఏలేశ్వరం మండల మాజీ జెడ్పీటీసీ జ్యోతుల వీరాస్వామి ఏలేశ్వరం నగర పంచాయితీ కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి,శంఖవరం మండల టిడిపి అధ్యక్షులు బద్ది రామారావు,బద్ధి రమణ,టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెన్నా ఈశ్వరుడు శంఖవరం మండల టిడిపి సీనియర్ నాయకులు పర్వత సురేష్,లంపకలోవ సొసైటీ మాజీ చైర్మన్ గొంతిన సురేష్,కార్మిక నాయకులు పత్రి రమణ,యువ నాయకులు యాళ్ల జగదీష్,యర్రాబత్తుల గోవిందునాయుడు,వెలుగుల నాని,అంబటి బుజ్జి,బొల్లు మనోజ్,పాల్గొన్నారు

## గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్ సాధించిన పురపాలక సంఘ ఉద్యోగి



**బాపట్ల జిల్లా ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల పురపాలక సంఘము కార్యాలయనందు రెవిన్యూ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న షేక్ ఇమామ్ శనివారం గుంటూరు యన్.టి.అర్ స్టేడియం లో జరిగిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్ -2024 లో బాపట్ల జిల్లా తరుపున 400 మీటర్లు 800 మీటర్లు మరియు 1500 మీటర్ల పరుగులో ఒక గోల్డ్ రెండు సిల్వర్ మెడల్స్ సాధించి 2025 ఫిబ్రవరి నెలలో కేరళలో జరిగే నేషనల్ మీట్ కి అర్హత సాధించారు ఈ సందర్భంగ ఆదివారం పురపాలక సంఘ కార్యాలయంలో కమీషనర్ జి.రఘునాథ రెడ్డిని షేక్ ఇమామ్ కలిశారు అనంతరం కమిషనర్ తన కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా గా పని చేస్తున్న ఇమామ్ గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్ సాధించినందుకుగాను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోటీలలో గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్స్ గెలుపొందడం పురపాలక సంఘానికి చాలా గర్వకారణమన్నారు భవిష్యత్ పోటీలలో కూడా గెలుపొంది మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు ఈ కార్యక్రమంలో పురపాలక సిబ్బంది ఇమామ్ ని అభినందించారు

# ఇందిరమ్మ ఇళ్ల డేటా ఎంట్రీ సమస్యకు పరిష్కారం





**కరీంనగర్ :** అవసరం మన ఆలోచనలకు పదును పెడుతుంది. ఆవిష్కరణలవైపు అడుగులు వేయిస్తుంది. సమస్యలకు పరిష్కార మార్గం వెతుకుతుంది. ప్రపంచంలో చాలా వరకు ఇలా ఆవిష్కృతమైనవే. ఆవిష్కరించాలి అంటే.. అందుకు సైంటిస్టే కానవసరం లేదు. అవసరం మన ఆలోచనలకు పదును పెడుతుంది. సమస్యకు పరిష్కారం కనుగొనే దిశగా ఆలోచింప జేస్తుంది. ఈ క్రమంలో ఆవిష్కరణలవైపు అడుగులు వేయిస్తుంది. సృష్టిలో కొన్ని సహజ సిద్ధంగా పరిష్కార మార్గాలు చూపితే.. చాలా సమస్యలకు మనిషే పరిష్కారం కనుగొన్నాడు. అందుకే ఆది మానవుల కాలం నుంచి ఆధునిక మానవుడిగా ఎదగగలిగాడు. ఇక నేటి తరం యువత సమస్యల పరిష్కారానికి అనేక మార్గాలు కనిపెడుతోంది. పిల్లలు కూడా తమ మెదడుకు పదును పెట్టి ఆవిష్కరణలు చేస్తున్నారు. చదువుకున్న జ్ఞానంతో కొత్త కొత్త ఆవిష్కరణలతో ప్రతిభ కనబరుస్తున్నారు. రెండేళ్ల క్రితం వేములవాడకు చెందిన బాలుడు ధాన్యం బస్తాల్లోకి ఎత్తే చిన్న పరికరం తయారు చేశాడు. దీంతో తన తండ్రి సమస్యకు పరిష్కారం కొనుగొన్నాడు.ఇక ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడ పని తప్పించుకుందామని చూస్తారు. కరెంటు పోయినా, ఇంటర్నెట్ అవాంతరాలు ఏర్పడినా ఖాళీగా ఉంటారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నా మేం ఏం చేయాలని ఎదురు ప్రశ్నిస్తారు. అయితే అందరూ అలాగే ఉండాటారని కాదు. కొంత మంది తీరుతో అందరూ అపవాదు ఎదుర్కొంటున్నారు. అయితే తెలంగాణలో ఓ పంచాయతీ కార్యదర్శి మాత్రం సాకులు చెప్పి తప్పించుకోకుండా సమస్యకు పరిష్కారం కనుగొని విధులు సక్రమంగా నిర్వహిస్తున్నాడు.మంథని మండలం ఉప్పట్ల పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్నారు. గ్రామంలో సెలఫోన్ సిగ్నల్ సక్రమంగా ఉండడం లేదు. దీంతో తరచూ అవాంతరాలు కలుగుతున్నాయి. సర్వే ఆలస్యం అవుతోంది. దీంతో ఆయనకు వినూత్న ఆలోచన చేశాడు. ఎత్తయిన ప్రాంతంలో ఉంటే సిగ్నల్ సమస్య ఉండడం లేదని గుర్తించాడు. దీంతో తన సెల్‌ఫోన్‌ను కర్రకు కట్టి.. ఎత్తుగా ఉంచుతున్నాడు. దాని వైపై ఆన్‌చేసి.. మరో సెల్‌ఫోన్‌లో ఇందిరమ్మ యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నాడు. దీంతో సర్వే పని చకచకా జరుగుతోంది. గ్రామంలో సర్వేకు 390 దరఖాస్తులు రాగా, పది రోజుల్లో 230 దరఖాస్తులు సర్వే చేశారు. మరో 170 ఇళ్లు సర్వే చేయాల్సి ఉందని కార్యదర్శి తెలిపారు.=

# వేములవాడలో అడగడుగునా నిఘా వైఫల్యం




**కరీంనగర్ :** వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది. మొన్న రాజన్న కోడలు అక్రమంగా విక్రయానికి గురైన ఘటన మరిచిపోక ముందే ఆలయంలోని హుండీలో నగదు మాయం కలకలం సృష్టిస్తుంది. మరోవైపు మాంసాహారం ఆలయ ఆవరణలో పంపిణీ విమర్శలకు తావిస్తుంది.దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ లో వరుస ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్యలు సాగుతుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తుంది. నిత్యం వేలాది మంది భక్తులు సందర్శించే రాజన్న ఆలయంలో అధికారుల నిర్లక్ష్యం, నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.గర్భాలయంలోని హుండీల నుంచి నగదు చోరీ అధికారుల నిర్లక్ష్యానికి, నిఘా వైఫల్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది. వారంలో మూడు సార్లు హుండీల నుంచి మైనర్లు డబ్బులు తీసుకుపోతుంటే నిఘా కెమెరాలు, భద్రతా సిబ్బంది, హడావిడి చేసే ఆలయ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొక్కుబడి చర్యలతో చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తి భావంతో భక్తులు సమర్పించే కానుకలు చోరీకి గురికావడం, కోడెలు అక్రమంగా విక్రయించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.ప్రస్తుతం హుండీలో నగదు ఎత్తుకెళ్లిన ఇద్దరు మైనర్లను పోలీసులు గుర్తించారు. అరెస్టు చేసి జువెనైల్ కు తరలించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టారు. గతంలో పలువురు హుండీలలోని నగదు కాజేసి కటకటాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఓవైపు కోడెల గోల నడుస్తుంటే, ప్రస్తుతం హుండీలోని నగదు మైనర్లు ఎత్తుకెళ్లడం అధికారుల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తుంది.మరోవైపు ఆలయ ఆవరణలో మాంసాహారం పంపిణీ వివాదాస్పదంగా మారింది. క్రిస్మస్ రోజున ఆలయ ఆవరణలో చికెన్ రైస్ ఎగ్ రైస్ గుర్తుతెలియని వ్యక్తులు పంపిణీ చేశారు. అన్యమత ప్రచారం అంటూ సర్వత్రా ఆందోళన వ్యక్తం కావడంతో అప్రమత్తమైన పోలీసులు, ఆలయ అధికారులు విచారణ చేపట్టారు. చివరకు చికెన్ రైస్ ఎగ్ రైస్ ఆలయ ఆవరణలో పంపిణీ చేయలేదని బయట పంపిణీ చేసిన దాన్ని నిత్యం అక్కడ అడుక్కునే నిరుపేద భక్తులు ఆలయ ఆవరణలోకి తీసుకొచ్చినట్లు స్పష్టం చేశారు. మరోసారి అలా జరగకుండా కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.ఆలయ అధికారులు, నిఘా వర్గాలు చేతులుకాలక ఆకులు పట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకుండా హుండీలో నగదు మాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసి? ఆలయ ఆవరణలో మాంసాహారం పంపిణీతో శుద్ధిచేసి సంప్రోక్షణ నిర్వహించారు. ఇకనైనా అధికారులు మేల్కొని పకడ్బందీ చర్యలు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిచో ఆందోళన చేపట్టక తప్పదని విశ్వహిందూ పరిషత్, బిజెపి నాయకులు హెచ్చరించారు. మరోవైపు గత నెలలో రైతుల పేరిట రాజన్న కోడెలు పొంది అక్రమంగా విక్రయించిన విషయంపై అధికారులు విచారణ చేపట్టారు. ఇప్పటికే వరంగల్ జిల్లాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసి అక్రమంగా కోడెలు పొందిన వారి నుంచి 26 కోడెలు స్వాధీనం చేసుకుని రాజన్న గోషాలకు తరలించారు. మరోవైపు ఏడాది కాలంగా రాజన్న కోడెలు 1975 పొందిన వారు రైతులా, రైతుల మసుగులో దళారులా అని తేల్చేందుకు సమగ్ర సర్వే చేపట్టారు. సర్వే కోసం 20 మందిని నియమించి తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాలకు, జిల్లాకు ఇద్దరు చొప్పున నియమించి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు నివేదిక సమర్పించనున్నారు. కలెక్టర్ సైతం రాజన్న గోశాలను సందర్శించి పశువుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆలయ అధికారులను, పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.

# పోలీస్ శాఖ ప్రభుత్వ ప్రతిష్టను పెంచుదాం






## కానిస్టేబుల్ ఈవెంట్స్ను విజయవంతం చేద్దాం

- ఈనెల 30 నుంచి జనవరి 17 వరకు నిర్వహించే పోలీస్ ఫిజికల్ ఈవెంట్స్ కు నీలం సంజీవరెడ్డి మైదానంలో ఈరోజు చేపట్టిన ట్రైల్ రన్ సక్సెస్
- హాజరు కానున్న పురుష అభ్యర్థులు 5242, మహిళా అభ్యర్థులు 1237 మొత్తం కలిపి 6,479 మంది
- అభ్యర్థులు అడ్మిట్ కార్డులో నిర్దేశించిన తేదీ, సమయాల్లో ఒరిజినల్ సర్టిఫికేట్లు మరియు కాపీలను తప్పనిసరిగా తీసుకురావాలి
- జిల్లా ఎస్పీ పి.జగదీష్

**అనంతపురం డిసెంబర్ 29:** అనంతపురం జిల్లాలోని పోలీస్ శాఖలోఅందరూ సమిష్టిగా, సమర్థవంతంగా పనిచేసి కానిస్టేబుల్ ఈవెంట్స్ను విజయవంతం చేద్దామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రభుత్వానికి, పోలీసుశాఖకు మంచి పేరు తెద్దామన్నారు. ఈనెల 30 నుంచి జనవరి 17 వ తేదీ వరకు నిర్వహించే పోలీస్ ఫిజికల్ ఈవెంట్స్ కు నీలం సంజీవరెడ్డి మైదానంలో ఈరోజు ట్రైల్ రన్ నిర్వహించారు. ఈవెంట్స్ లో పాల్గొనేందుకు వచ్చిన అభ్యర్థులు నీలం సంజీవరెడ్డి మైదానంలోకి ప్రవేశించే ద్వారం మొదలుకొని, ధ్రువపత్రాల పరిశీలన, ధ్రువపత్రాల కంప్యూటరీకరణ, దేహదారుఢ్య పరీక్షలు ముగించుకొని వెళ్లే ద్వారం వరకు చేపట్టవలసిన ప్రక్రియకు సంబంధించి మైదానంలో ఏర్పాటు చేసిన ప్రతి పరీక్ష ఘట్టాన్ని సూచించే విధంగా సూచిక బోర్డులు మరియు ప్రతి ఒక్క ఈవెంట్ ట్రైల్ రన్ ను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. పోలీసు అధికారులు మరియు సిబ్బంది, పోలీస్ కార్యాలయ సిబ్బందికి వారికి... విది విధానాలపై పలు సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు అభ్యర్థులకు కేటాయించిన తేదీల్లో హాజరయ్యేలా సమయపాలన పాటిస్తూ తమతోపాటు అడ్మిట్ కార్డు, సంబంధిత సర్టిఫికెట్ల తీసుకోని రావాలన్నారు. దేహ దారుఢ్య పరీక్షలు ఎటువంటి లోపాలు లేకుండా పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు, 1600 మీటర్ల పరుగు,100 మీటర్లు పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్స్ సంబంధించి అన్ని ఏర్పాట్లు



పూర్తి చేశామని, అభ్యర్థుల కొరకు వైద్య శిబిరం, మంచినీరుతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ గారితో పాటు అదనపు ఎస్పీలు డి.వి.రమణమూర్తి, ఇలియాజ్ బాషా (ఏ.ఆర్), జిల్లాలోని డీఎస్పీలు, పలువురు సి.ఐ లు, ఆర్ ఐ లు, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 4 ధర్మవరం పట్టణ చేనేత కులాల ఐక్యవేదిక

నిర్వాహకురాలు సంకారపు జయశ్రీ.

**ధర్మవరం డిసెంబర్ 29:** చేనేత కుల బాంధవుడు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సన్మాన కార్యక్రమం జనవరి 4వ తేదీ శనివారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు నిర్వహిస్తున్నట్లు ధర్మవరం పట్టణ చేనేత కులాల ఐక్యవేదిక నిర్వాహకురాలు సంకారపు జయశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వాటికి సంబంధించిన కరపత్రాలను పట్టణంలోని తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపంలో సభ్యులతో కలిసి విడుదల చేశారు. అనంతరం జయశ్రీ మాట్లాడుతూ ఈ సన్మాన కార్యక్రమం పట్టణంలోని శివానగర్ శివాలయము ప్రాంగణమునందు ఖాళీ ప్రదేశం నందు జరుగునని తెలిపారు. చేనేత కుల బాంధవుడు బిసి వర్గానికి చెందినటువంటి కందికుంట వెంకటప్రసాద్ ను సన్మానించడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. ఏపీలో ఉన్నటువంటి 18 చేనేత కులాల వారికి ఒక పండుగ దినము అని తెలిపారు. అదేవిధంగా ధర్మవరం ప్రథమ పౌరురాలు అయినటువంటి మున్సిపల్ చైర్పర్సన్ కాచర్లలక్ష్మి, ఆల్ ఇండియా రివర్స్ ఫెడరేషన్ చైర్మన్ బండారు ఆనందప్రసాద్ ను రాజకీయాలకు అతీతంగా ఘనంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మన చేనేత కులాలను గౌరవించుకున్న వాళ్ళము అవుతామని తెలిపారు. ధర్మవరం పట్టణంలో దాదాపు 80 వేలకు పైగా ఉన్నటువంటి చేనేత కులాల వారు ప్రతి ఒక్కరు ఈ సన్మాన కార్యక్రమంలో హాజరై కుటుంబ సమేతంగా రావాలని తెలిపారు. అదేవిధంగా తోగటవీర క్షత్రియ, పద్మశాలి, పట్టు శాలి, దేవాంగం, స్వకుల సాలె, కుర్ని, కత్రి చేనేత కుల బాంధవులు కూడా వేలాదిగా తరలివచ్చి ఈ సభను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సభలో చేనేతల సమస్యలు గూర్చి చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిర్రాజు రవి, గణేష్, గంగాధర్,గుద్దిటి రాము



, బీరేగోపాల్, కొండా పుల్లయ్య, టీచర్ ప్రకాష్, పరిసే సుధాకర్, చింతా నాగరాజు, దాసరి రంగయ్య, హేమంత్, పామిశెట్టి శివశంకర్, బీరే కేశవ నీలూరి శ్రీనివాసులు ,గడ్డం శ్రీనివాసులు, గడ్డం పార్థ ,కోనేటి వెంకటేష్, పొట్టి ప్రసాద్, ఉక్కిసలగోవిందు, ఉక్కిసెల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

- : పిఆర్ పరిధిలో రహదారులు, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం వేగవంతం చేయాలి
: రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మంత్రివర్యులు పయ్యావుల కేశవ్
- : పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పయ్యావుల కేశవ్



**అనంతపురం, డిసెంబర్ 29:** అనంతపురం జిల్లాలోనిఉరవకొండ నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక %డ% ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి అనంతపురం నగరంలోని రామ్ నగర్ లో ఉన్న మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గంలోని గ్రామాల్లో రహదారులు, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణంపై పంచాయతీ రాజ్ అధికారులతో మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో చేపడుతున్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో రహదారులు, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. జనవరి నెలాఖరులోపు చేపట్టిన సిసి రోడ్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం ఈఈ ప్రభాకర్ రెడ్డి, డిఈ రసూల్, ఏఈలు రమణయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

## ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చూసుకోవాలి...

- 30 పోలీస్ ఆక్ట్ అమలు లో ఉన్నందున పోలీసుల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు...
- ఈ వేడుకల సందర్భంగా ప్రకటన విడుదల చేసిన జిల్లా ఎస్పీ శ్రీమతి వి రత్న

**పుట్టపర్తి డిసెంబర్ 29:** శ్రీ సత్య సాయి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలీస్ శాఖ ఆదేశాలను పాటిస్తూజిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ఆరోగ్య కరమైన వాతావరణం లో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రత్న సూచించారు. 30పోలీస్ ఆక్ట్ అమలు లో ఉన్నందున ప్రజలందరూ పోలీస్ నిబంధనలు పాటించాలని మరియు ప్రజలందరూ కూడా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ శ్రీమతి వి రత్న హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో , రోడ్లపై ఎటువంటి వేడుకలకు అనుమతి లేదన్నారు.రాత్రి 10 గం. తరువాత పోలీసులు వాహనల తనిఖీ చేపట్టున్నదున ఆత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో ముఖ్యమైన జంక్షన్లు అదే విధంగా ముఖ్యమైన ప్రదేశాలలో పికెట్లు వేయడం జరుగుతుందని ఎస్పి రత్న తెలిపారు.నూతన సంవత్సర వేడుకలలో బాగంగా డిసెంబర్ 31 రాత్రి యువకులు మద్యం సేవించి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అదే విదంగా కొంత మంది మద్యం మత్తులో గ్రూప్ లుగా ఏర్పడి గొడవలు జరిగి శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వాటిని దృష్టిలో ఉంచుకొని నూతన సంవత్సర వేడుకలలో ప్రజలు పాటించవలసిన నియమ నిబందనలను జిల్లా ఎస్పీ



రత్న వెల్లడించారు. 2025 కొత్త సంవత్సరాన్ని ప్రశాంతమైన వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ రత్నసూచించారు

**మద్యం దుకాణాలు మరియు రెస్టారెంట్లు నిర్ణీత సమయంలో మూసివేయాలి .**

బైక్ రేసులు, రాష్ డ్రైవింగ్ ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్స్ తీసివేసి అధిక శబ్దాలతో వాహనాలు నడపడం వలన ప్రజా జీవనానికి భంగం కలిగే అవకాశం ఉన్నందున వాటిని నిషేధింపబడినది, వీటిని అతిక్రమించిన యెడల పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ప్రజలందరూ తమ తమ ఇళ్లలోనే వారి కుటుంబ సభ్యులతో వేడుకలు చేసుకోవాలనీ, తల్లిదండ్రులు కూడా వారి పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.నూతన సంవత్సర వేడుకల ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ రత్న ఆకాంక్షించారు.

## కనకదాస విద్య, ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**రాప్తాడు, డిసెంబర్ 29:** కనకదాస విద్య ఉపాధ్యాయ సంక్షేమ సేవా సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణను స్థానిక కనకదాస విద్యార్థినుల వసతి గృహంలో ఆదివారం ఆవిష్కరించారు. సంఘ క్యాలెండరును ప్రముఖ కార్డియాలజిస్ట్ వంశీకృష్ణ, రాజహంస శ్రీనివాసులు చేత ఆవిష్కరణ చేశారు. ఉమ్మడి జిల్లాలోని నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కురుబ ఉపాధ్యాయులు కార్యక్రమానికి హాజరయ్యారని సంఘ అధ్యక్షులు మర్రిస్వామి, ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు తెలిపారు.

## కొడాలి నాని రాజకీయ సన్యాసం..!



రాజకీయాల్లో ఏమైనా జరగొచ్చు. ఎప్పుడు ఏం జరిగినా.. నాయకులు తమ మంచికేనని అనుకుంటారు. అయితే.. ఒక్కొక్కసారి జరిగే పరిణామాలు సంచలనాలకు వేదికగా మారుతుంటాయి. ఇప్పుడు అలాంటి పరిణామమే వైసీపీలోనూ జరగనుంది. కీలక నాయకుడు, ఫైర్ బ్రాండ్ కొడాలి నాని.. రాజకీయంగా సన్యాసం తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిసింది. దీనిపై త్వరలోనే ఆయన ప్రకటన చేయనున్నట్టు గుడివాడలో చర్చ సాగుతోంది. రాజకీయంగా కొడాలి నాని దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు కొడాలికి అత్యంత సన్నిహితంగా ఉన్న అనుచరులు చెబుతున్నారు. ప్రస్తుతం కొడాలి నాని అనారోగ్యంతో ఉన్నారని, ఆయన హైదరాబా ద్లో చికిత్స పొందుతున్నారన్నది గుడివాడ నియోజకవర్గంలో జరుగుతున్న చర్చ. అయితే.. ఈ రోజు కాకపోతే.. రేపైనా ఆయన నియోజకవర్గంలో యాక్టివ్ అవుతారని అందరూ భావించారు. కానీ, ప్రస్తుతం ఉన్న పరిస్తితులు.. రాజకీయంగా ఎదురయ్యే సవాళ్లను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే కొడాలి నాని సంచలన నిర్ణయం తీసుకున్నారన్నది ఆయన వర్గం చెబుతున్న మాట. వాస్తవానికి ఈ ఏడాది జరిగిన ఎన్నికలే తనకు చివరి ఎన్నికలని.. వచ్చే ఎన్నికల నాటికి తాను పోటీ చేసేది కూడా లేదని నాని చెప్పుకొచ్చారు. అయితే.. దీనిని రాజకీయంగా ఆయన సెంటిమెంటుకోసం వాడుకున్నారని అనుకున్నా.. తాజా ఎన్నికల్లో ఆయన ఓడిపోయిన తర్వాత ఎక్కడా కనిపించడం లేదు. పైగా కూటమి సర్కారు కేసులు పెడుతుందన్న బెరుకు ఉందని కొందరు అంటున్నారు. కానీ, అనారోగ్య సమస్యలు.. ఇతరత్రా సమస్యల కారణంగానే నాని రాజకీయాల నుంచితప్పుకొని.. వ్యాపారాలకే పరిమితం అవుతారని తెలుస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి ఆయన దాదాపు రాజకీయాల్లో ఉండే పరిస్థితి కూడా లేదని అనుచరుల నుంచి వినిపిస్తున్న మాట. మరి ఈయన గ్యాప్ ను ఎవరు ఫిలప్ చేస్తారనేది చూడాలి. ప్రస్తుతం ఉన్న అంచనాల మేరకు.. కొడాలి తమ్ముడు కొడుకు నియోజకవర్గంలో రంగంలోకి దిగే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. కొడాలి కనుక రాజకీయాల నుంచి నిజంగానే తప్పుకొంటే గుడివాడలోనేకాదు.. రాష్ట్ర వ్యాప్తంగా కూడా సంచలనమే.

## ప్రత్యేక డ్రైవ్ తో సహకార సంఘాల సభ్యుల ఈకేవైసీని చేపట్టాలి

- : శివ్ నారాయణ్ శర్మ, జిల్లా కలెక్టర్ (ఎఫ్.ఏ.సి)



**అనంతపురం, డిసెంబర్ 29 :** ప్రాథమిక సహకార సంఘాల సభ్యుల ఈకేవైసీని ప్రత్యేక డ్రైవ్ ద్వారా చేపట్టాలని శివ్ నారాయణ్ శర్మ, జిల్లా కలెక్టర్ (ఎఫ్.ఏ.సి) పేర్కొన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకమైన పిఏసిఎస్ యొక్క కంప్యూటరైజేషన్ లో భాగంగా రికార్డులలో ఈకేవైసీ వివరాలను నవీకరించడానికి మిషన్ మోడ్ లో డ్రైవ్ చేపట్టడం జరుగుతోందన్నారు. కంప్యూటరైజేషన్ లో భాగంగా సహకార సంఘాల సభ్యులందరూ ఈకేవైసీని చేయించుకునేలా చూడాల్సిందిగా సహకార సంఘముల కమిషనర్ నుండి ఉత్తర్వులు రావడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాల సభ్యులందరూ సంబంధిత సచివాలయాల్లో వారి యొక్క ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలకు సంఘ సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతో సభ్యులంతా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వీలైనంత త్వరగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని, సహకార సంఘాల సభ్యుల ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయడంపై దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని, పర్యవేక్షించాలని జిల్లా కోపరేటివ్ అధికారి అరుణ కుమారిని జిల్లా కలెక్టర్ (ఎఫ్.ఏ.సి) ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘములలో గ్రామ సచివాలయం సిబ్బంది సంఘ సభ్యులు యొక్క ఈకేవైసీ సేకరించడం జరుగుతుందని, సభ్యులు గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం సిబ్బందికి అవసరమైన ఓటిపి మరియు వేలిముద్రలు వేసి ఈకేవైసీ పూర్తి చేసేందుకు సహకరించాలని సూచించారు. సభ్యులు ఈకేవైసీ లేకుండా ఎటువంటి లావాదేవీలు చేయలేరని మరియు జనవరి 1వ తేదీ తర్వాత రుణాలతో సహా అన్ని పిఏసిఎస్ సేవలు ఆన్లైన్లో ఉంటాయని, ఈ విషయాన్ని గమనించి సభ్యులంతా ఈకేవైసీ చేయించుకునేందుకు ముందుకు రావాలన్నారు.

## జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు కుటుంబానికి రూ.5 లక్షల భీమా చెక్కు అందజేసిన మంత్రి నాదెండ్ల



**కోనసీమ జిల్లా రిపోర్టర్ డిసెంబర్ 29:** మండపేట పట్టణంలో ఇటీవల ప్రమాదవశాత్తూ మరణించిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు కొమ్మిశెట్టి వెంకటేష్ కుటుంబానికి 5 లక్షల రూపాయల భీమా చెక్కును రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు, జనసేన పార్టీ PAC చైర్మన్ నాదెండ్ల మనోహర్ బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల చదువుల బాధ్యతను పార్టీ చూస్తుందని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా సభ్యత్వం నమోదు చేయించిన వాలంటీర్ బొమ్మన సతీష్ కు నాదెండ్ల మనోహర్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇంచార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం





**వ్యవసాయంలో సాంకేతికత చాలా అవసరం**

**సాగులో యాంత్రీకరణ ఇందులో భాగమే**

**పంట కోత యంత్రాల పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత**

**సబ్సిడీ పై పంట కోత యంత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సునీత**

**అనంతపురం డిసెంబర్ 29:** గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని రాప్తాడు శాసన సభ్యురాలు పరిటాల సునీత అన్నారు. వ్యవసాయంలో సాంకేతికత చాలా అవసరం అని.. సాగులో యాంత్రీకరణ కూడా ఇందులో భాగమేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని రైతులకు సబ్సిడీపై పంట కోత యంత్రాలను ఆమె పంపిణీ చేశారు. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. కనగానపల్లి మండలం తూముచర్ల గ్రామానికి చెందిన కురుబ మల్లే వసికేరప్ప, చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన అశ్వర్ధ రెడ్డి, ప్యాదిండి గ్రామానికి చెందిన చంద్రాచర్ల నరసింహులుకి సబ్సిడీపై యంత్రాలను ఎమ్మెల్యే సునీత అందజేశారు. ఒక్కో యంత్రం విలువ 5లక్షల 70వేలు కాగా.. ప్రభుత్వం 2లక్షల రూపాయలు సబ్సిడీ ఇస్తోంది. మిగిలిన 3లక్షల 70వేల రూపాయలు రైతు చెల్లించాల్సి ఉంటుంది. యంత్రాలు అందుకున్న రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా ఇలాంటి యంత్రాలు వస్తాయని ఆశించామని.. కానీ ఎక్కడా ఆ ఊసే లేదన్నారు. ఈ రోజు ఎమ్మెల్యే సునీత సహకారంతో యంత్రాలు అందాయని రైతులన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఇటీవల కాలంలో రైతులకు పెట్టుబడుల భారం పెరిగిపోయి వ్యవసాయం భారమైందన్నారు. ఇందులో ముఖ్యంగా కూలీల ఖర్చు ఎక్కువగా ఉందని.. పైగా కూలీల కొరత కూడా ఉందన్నారు. దీనిని అధిగమించేందుకు ఈ యంత్రాలు ఉపయోగపడుతాయన్నారు. వ్యవసాయాన్ని సులభతరం చేసే విధంగా సాంకేతికత తీసుకురావాలని మొదటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారని.. అందులో భాగంగానే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు వివరించారు. ఈ ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మరికొంత మంది రైతులకు ఇలాంటి యంత్రాలు ఇతర అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని ఎమ్మెల్యే సునీత అన్నారు.....

# అనంతలో రోడ్లు నాణ్యతతో వెయ్యాలి





**కాంట్రాక్టర్లకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన**

**రాంనగర్ 80ఫీట్ మార్గంలో జరుగుతున్న రోడ్డు పనులు పరిశీలన**

**టీడీపీ అధికారంలోకి వచ్చాకనే రోడ్లకు మోక్షం వస్తోందన్న ఎమ్మెల్యే**

**అనంతపురం డిసెంబర్ 29:** రోడ్డు పనుల నాణ్యతలో రాజీ లేకుండా పని చేయాలని కాంట్రాక్టర్లకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. అనంతపురం నగరంలోని రాంనగర్ 80ఫీట్ మార్గంలో శ్రీనగర్ కాలనీలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలసి ఆయన రోడ్డు వెంబడి మొత్తం పనులు పరిశీలించారు. నాణ్యత విషయం గురించి తెలుసుకున్నారు. అనంతరం కాంట్రాక్టర్లతో మాట్లాడి.. పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారన్నది తెలుసుకున్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వైసీపీ హయాంలో నగరంలో రోడ్లన్నీ అధ్వాన్నంగా ఉండేవని.. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే రోడ్లకు మహర్దశ వచ్చిందన్నారు. నగరంలో రోడ్లన్నీ మరమ్మతులు చేస్తామని.. నూతన రోడ్లు అవసరమైన చోట ప్రతిపాదనలు పంపుతున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్, తెలుగుయువత నాయకుడు నెట్టమ్ బాలకృష్ణ, టీడీపి డాక్టర్ సెల్ రాష్ట్ర నాయకుడు లక్ష్మీ ప్రసాద్, పంచాయితీరాజ్ ఛాంబర్ నాయకుడు, మాజీ ఎంపిపి ఇస్మాయిల్, టిడిపి నాయకులు గొనుగుంట్ల అమర్, చేరుకుతోట పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలల్లో అదనపు సీట్లు కేటాయించండి

**నసనకోట ఎంజేపి పాఠశాలను జూనియర్ కళాశాలకు అప్ గ్రేడ్ చేయండి**

**ఎంజేపీ గురుకుల పాఠశాలల సెక్రటరీకి ఎమ్మెల్యే పరిటల సునీత విజ్ఞప్తి**

**వెంకటాపురంలో ఎమ్మెల్యే సునీతను కలసిన ఎంజేపీ సెక్రటరీ కృష్ణమోహన్**



**అనంతపురం డిసెంబర్ 29:** అనంతపురం జిల్లారాప్తాడు నియోజకవర్గంలో గురుకుల పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి ప్రతి తరగతికి అదనపు సీట్లు కేటాయించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంజేపీ గురుకుల పాఠశాలల సెక్రటరీ కృష్ణ మోహన్ జిల్లా పర్యటనలో భాగంగా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని పేరూరు, నసనకోట ఎంజేపి బాల బాలికల పాఠశాలల పరిశీలనకు వచ్చారు. ఈ క్రమంలో ఆయన వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీతతో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఈసందర్భంగా గురుకుల పాఠశాలల్లో ఉన్న పరిస్థితుల గురించి చర్చించారు. రామగిరి ప్రాంతం అత్యంత వెనుకబడిన ప్రాంతమని..ఈ ప్రాంతంలో రైతులు, కూలీలు ఎక్కువగా ఉన్నారన్నారు. వీరి పిల్లల్ని దూర ప్రాంతాలకు వెళ్లి చదివించే పరిస్థితి ఉండదన్నారు. అందుకే ఎక్కువగా పేరూరు, నసనకోట ఎంజేపి గురుకుల పాఠశాలల మీద ఆధారపడ్డారన్నారు. ఈ నేపథ్యంలో తగినన్ని సీట్లు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే ఏడాది నుంచి అదనపు సీట్లు, తరగతులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా నసనకోట ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాల 10వ తరగతి వరకే ఉందన్నారు. 10 తర్వాత చాలా మంది బాలికల్ని దూర ప్రాంతాలకు పంపించలేక చదువు ఆపేస్తున్నారన్నారు. అందుకే ఇక్కడ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తే ఎంతో మందికి ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే ఈ విషయంపై సంబంధిత మంత్రికి వినతిపత్రం ఇవ్వగా ఆ ఫైల్ అదనపు సమాచారం కోసం ఫైనాన్స్ డిపార్ట్మెంట్ లో ఉన్నట్టు తెలుపుతూ వారికి కావలసిన సమాచారాన్ని అందజేసి వచ్చే విద్యాసంవత్సరంలో జూనియర్ కళాశాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. మరోవైపు పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని వాటికోసం పూర్తి స్థాయిలో నిధులు వచ్చేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే సునీత చెప్పిన అన్ని అంశాలకు ఎంజేపీ గురుకుల పాఠశాలల సెక్రటరీ కృష్ణ మోహన్ సానుకూలంగా స్పందించారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించి.. వీటిని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు....

## ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.



**ధర్మవరం డిసెంబర్ 29:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 55వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్ నందు జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్ హెచ్ భాష ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1970లో కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో స్వాతంత్రం,ప్రజాస్వామ్యం,సోషలిజం నినాదంతో అధ్యయనం పోరాటం అంటూ యావత్తు విద్యార్థుల సమస్యలపై రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలతో అనేక ఉద్యమాలు చేపడుతూ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏర్పడింది అని తెలిపారు. కేజీ నుండి పీజీ వరకు విద్యార్థుల సమస్యలు ఎక్కడుంటే అక్కడ ఎస్ఎఫ్ఐ అగ్రస్థానంలో ముందుంటు నిరంతరం విద్యార్థులను చైతన్య పరుస్తూ శాస్త్రీయ దృక్పథంతో ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కనుమ దామోదర్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు

## పెదపూడి మండల బిజెపి అధ్యక్షులుగా శివ ఏకగ్రీవంగా ఎన్నిక. అభినందించిన ఎమ్మెల్యే





**కాకినాడ జిల్లా డిసెంబర్ 29:** పెదపూడి మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్ష, ప్రతినిధి ఎన్నికలను అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,రిటర్నింగ్ అధికారి కురగంటి సతీష్ గార్ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. పెదపూడి మండల బిజెపి సంస్థగత ఎన్నికలలో ముమ్మడి శివ ని పెదపూడి మండల బిజెపి అధ్యక్షులుగా పెదపూడి మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. పెదపూడి మండల బిజెపి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ముమ్మడి శివ గారిని సత్కరించి, శుభాకాంక్షలు తెలిపిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,రిటర్నింగ్ అధికారి కురగంటి సతీష్,అనపర్తి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ శివరామకృష్ణంరాజు, పెదపూడి మండలం బిజెపి నాయకులు. ఈ కార్యక్రమంలో పెదపూడి మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల అవగాహనకు ఉపయోగపడే క్యాలెండర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ పి జగదీష్



**అనంతపురం డిసెంబర్ 29:** సైబర్ నేరాల అవగాహనకు ఉపయోగపడే నూతన క్యాలెండర్లను జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఆవిష్కరించారు. సైబర్ నేరాల పట్ల అవగాహన, సైబర్ స్మార్ట్ సిటిజన్, ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్, ఏపికె ఫైల్, డిజిటల్ అరెస్ట్ , తదితర సైబర్ మోసాల గురించి అవగాహన చేస్తూ నూతన క్యాలెండర్ లో రూపొందించారు. ప్రజలకు ఈ క్యాలండర్ లోని అంశాలు బాగా ఉపయోగపడుతాయని ఎస్పీ జగదీష్ అన్నారు.

## ధర్మవరం చేనేత మనుగడ కాపాడండి!



**ధర్మవరం డిసెంబర్ 29:** ధర్మవరం పట్టు పరిశ్రమ లో చేనేత సొసైటీ వ్యవస్థ ను రుణ మాఫీ చేసి ప్రస్తుత ప్రభుత్వం ఆదుకోవాలని ధర్మవరం సిల్క్ సొసైటీ తరుపున పామిశెట్టి రామకృష్ణ పేర్కొన్నారు.చేనేత కార్మికులు మహిళా చేనేత కార్మికులు అధికంగా కష్ట పడే చేనేత సంఘాలు గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని బిజెపి కూటమి తెలుగుదేశం ప్రభుత్వం లో ఈ చేనేత సహకార సంఘాలకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.గతం లో ఈ సొసైటీ లను ప్రగతి పదం లో నడిపిన పామిశెట్టి సంజీవ రాయుడు సేవలను ధర్మవరం చేనేత కార్మికులు మరువలేరన్నారు.

## శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీష్ ప్రసాద్ ఎంపిక...



**ధర్మవరం డిసెంబర్ 29:** పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల అతి పురాతనమైన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం కమిటీకి అడ్ హక్ కమిటీ చైర్మన్ గా చెన్నం శెట్టి జగదీష్ ప్రసాద్ ను ఎంపిక చేసినట్లు ఆలయ ఈవో వెంకటేశులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలోని అర్చకులు కొనేరాచార్యులు, మకరంద బాబు, భాను ప్రకాష్ చెన్నం శెట్టి జగదీష్ ప్రసాద్ దంపతులకు ఆలయ ఈవో ఆధ్వర్యంలో స్వాగతం పలికి, వారి పేరిటన ప్రత్యేక అర్చనలు పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ జనవరి 10వ తేదీన వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రతి వ్యక్తి దైవభక్తి కలిగి ఉండాలని, దైవత్వంతోనే కుటుంబంలో సుఖశాంతులు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు చేరిక... బిజెపి నాయకుడు డోలా రాజారెడ్డి.



**ధర్మవరం డిసెంబర్ 29:** వైయస్సార్ పార్టీ సర్పంచ్ అంగజాల నాగమణి భర్త అంగజాల రాజశేఖర్ (రాజు) ఆధ్వర్యంలో 30 మంది వైయస్సార్ పార్టీకి చెందిన వారితోపాటు పట్టణంలోని 27 వార్డు చెందిన వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు ధర్మవరం బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి నాయకత్వంలో జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు జిఎం. శేఖర్ సమక్షంలో బిజెపి పార్టీలోకి ఆదివారం చేరారు. ఈ సందర్భంగా శేఖర్ బిజెపి కండువా వేసి ఘనంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ బీజేపీ పార్టీ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని వారు తెలిపారు.

# మనాలి సమీపంలోని రహస్య ప్రదేశాలు



మీరు ఈ శీతాకాలపు సెలవుల్లో మనాలి చుట్టూ ఉన్న కొన్ని ఆఫ్‌బీట్ ప్రదేశాలను కవర్ చేయాలనుకుంటే, ఈ కథనం మీ కోసం. అసలైన, ఇక్కడ మీకు ఆ అందమైన ప్రదేశాల గురించి చెప్పబడింది, ఇక్కడ మీరు అద్భుతమైన వీక్షణలను చూడటమే కాకుండా ఇక్కడ సాహసం కూడా చేయగలరు. ప్రజలు శీతాకాలంలో హిమపాతం చూడటానికి వెంటనే హిల్ స్టేషన్‌ల కోసం ప్రణాళికలు వేస్తారు, కాని శీతాకాలపు సెలవుల కారణంగా, ప్రతి సంవత్సరం ఈ హిల్ స్టేషన్‌లలో భారీ సంఖ్యలో పర్యాటకులు గుమిగూడారు, దీని కారణంగా ప్రజలు తమ సెలవులను పూర్తిస్థాయిలో ఆస్వాదించలేరు. అటువంటి పరిస్థితిలో, ఈసారి కూడా మీరు ఏదైనా చల్లని ప్రదేశానికి వెళ్లాలనుకుంటే, అది చాలా నిశ్శబ్ద ప్రదేశంగా ఉండాలి, అప్పుడు ఈ కథనంలో మనాలికి సమీపంలోని చాలా తక్కువ మందికి తెలిసిన అటువంటి ఆఫ్‌బీట్ ప్రదేశాల గురించి మీకు తెలియజేస్తున్నాము. అటువంటి పరిస్థితిలో, మీరు ఈ ప్రదేశాలలో ప్రశాంతంగా , విశ్రాంతిగా సెలవులను ఆస్వాదించవచ్చు. చాలా మంది మనాలిని తప్పక సందర్శించినప్పటికీ, దాని చుట్టూ ఉన్న ప్రదేశాల గురించి కూడా తెలుసు, వీక్షణలు మిమ్మల్ని మంత్రముగ్ధులను చేస్తాయి. ఈ ప్రదేశాలలో తక్కువ సాధారణ రద్దీ ఉంటుంది, దీని కారణంగా ఇక్కడ మీ స్నేహితులు , కుటుంబ సభ్యులతో నాణ్యమైన సమయాన్ని గడపడానికి మీకు తగినంత అవకాశం లభిస్తుంది. ఇది కాకుండా, మీరు ఈ ప్రదేశాలలో ట్రెక్కింగ్ వంటి సాహసాలను కూడా ఆస్వాదించగలరు. కాబట్టి మనాలి సమీపంలోని ఈ ఆఫ్‌బీట్ ప్రదేశాల గురించి తెలుసుకుందాం.

మీరు ట్రెక్కింగ్ చేయాలనుకుంటే, మనాలి నుండి కేవలం 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న జలపాతానికి వెళ్లడం మీకు ఉత్తమమైన ప్రదేశం. ఇక్కడ మీరు అనేక అద్భుతమైన వీక్షణలను చూడవచ్చు. వాస్తవానికి, మీరు సంవత్సరంలో ఏ సమయంలోనైనా జానా జలపాతాన్ని చూడటానికి వెళ్లవచ్చు. ఏది ఏమైనప్పటికీ, జన జలపాతాన్ని సందర్శించడానికి ఉత్తమ సమయం సెప్టెంబర్ నుండి జూన్ మధ్య ఉంటుంది. నిజానికి మనాలిలో ఈ సమయంలో చలికాలం కొనసాగుతుంది. అటువంటి పరిస్థితిలో, ఇక్కడ ఉష్ణోగ్రత మరింత పడిపోతుంది, ఇది ట్రెక్కింగ్‌ను మరింత సవాలుగా చేస్తుంది. హిమాలయాల ఒడిలో ఉన్న ఈ గ్రామం చాలా అందంగా ఉంటుంది. ప్రశాంతమైన వాతావరణం, సహజ సౌందర్యం , చుట్టూ ఉన్న పచ్చదనం మిమ్మల్ని ఆకర్షించడానికి ఎటువంటి రాయిని వదిలిపెట్టవు. ఈ ప్రదేశం గురించి చాలా మందికి తెలియదు, దీని కారణంగా మలానా గ్రామంలో పర్యాటకుల రద్దీ చాలా అరుదుగా కనిపిస్తుంది. ఈ గ్రామం ట్రెక్కింగ్‌కు ప్రసిద్ధి. సాహస ప్రియులు ఇక్కడ ఒక ప్రణాళికను రూపొందించుకోవాలి. ఈ జాబితాలో నగ్గర్ కోట పేరు కూడా చేర్చబడింది, దీని గురించి చాలా మందికి తెలియదు. ఈ ప్రదేశం దాని అందంతో పాటు చరిత్రకు కూడా ప్రసిద్ధి చెందింది. భారత ప్రభుత్వం ఇప్పటికే ఈ కోటను జాతీయ వారసత్వ సంపదగా ప్రకటించింది. మీరు కులు-మనాలికి వెళ్లాలని ప్లాన్ చేసుకుంటే, తప్పకుండా ఒకసారి ఈ ప్యాలెస్‌ని చూడటానికి వెళ్లండి. ఇక్కడి వీక్షణలు అద్భుతంగా ఉన్నాయి.

# ఖాళీ కడుపుతో కరివేపాకు నమిలి తింటే..

ఖాళీ కడుపుతో కరివేపాకు నమిలి తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి అని చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం. చాలామంది ఈ కూరలో కరివేపాకే కదా అని తీసి పక్కన పెట్టేస్తూ ఉంటారు. కానీ ఆ కరివేపాకు వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి చాలామందికి తెలియదు. కరివేపాకు వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలిస్తే మాత్రం తినకుండా అస్సలు ఉండలేరు. ఎన్నో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. అయితే ఈ కరివేపాకు ఆకులను ఉదయాన్నే పరగడుపున ఖాళీ కడుపుతో నమిలి తినడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చు అని చెబుతున్నారు.. కరివేపాకులో విటమిన్, ఎ, బి, సి, ఈ లతో పాటు కాల్షియం, ఐరన్, ఫాస్పరస్ లినాలూల్, ఆల్ఫా టెర్పినేన్, మైర్సీన్, మహా నీంబైన్, క్యారియోఫిలీన్ తో పాటు మరికొన్ని గుణాలు ఉన్నాయి. ఇవన్నీ ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిని రోజూ ఉదయాన్నే నాలుగు నమిలి తినడం వల్ల చాలా రకాల లాభాలు కలుగుతాయి అని చెబుతున్నారు. మలబద్ధకం కడుపునొప్పి గ్యాస్ కడుపు ఉబ్బరం వంటి సమస్యలతో బాధపడేవారు ఉదయాన్నే నాలుగు కరివేపాకు ఆకులను నమ్మితే తినడం వల్ల ఈ సమస్యలన్నీ దూరమవుతాయట. అలాగే కరివేపాకు అధిక బరువు సమస్యను కూడా దూరం చేస్తుందని చెబుతున్నారు. కరివేపాకు మన బాడీని డీటాక్స్ చేసినట్టుగానే మన లివర్ ని కూడా కాపాడుతుందట. ఇందులోని గొప్ప గుణాలు లివర్ ని డీటాక్సీ ఫై చేసి కాలేయాన్ని కాపాడతాయి.అదే విధంగా కరివేపాకులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు బాడీ ఇన్ ఫ్లమేషన్ ని తగ్గిస్తుంది. దీని వల్ల మంట వాపు వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. కాగా ఉదయాన్నే పరగడపున కరివేపాకు నమిలి తినడం వల్ల బ్లడ్ గ్లూకోజ్



లెవల్స్ రెగ్యులేట్ అవుతాయి. దీని వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ, డయాబెటిస్ వంటి సమస్యలు కూడా కంట్రోల్ అవుతాయి. అందుకే షుగర్ లాంటి సమస్యలు ఉన్నవారు ఉదయాన్నే కరివేపాకుల్ని శుభ్రంగా క్లీన్ చేసి తినడం మంచిదని చెబుతున్నారు. కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. దీని వల్ల వీటిని నమిలి తినడం వల్ల బాడీలోని అన్‌వాంటెడ్ టాక్సిన్స్ అన్నీ వెళ్ళిపోయి డీటాక్సీ ఫై అవుతుంది. దీని వల్ల మొత్తం శరీరానికే చాలా మంచిది. మనం తినే జంక్ ఫుడ్, అన్‌హెల్దీ లైఫ్‌స్టైల్ కారణంగా బాడీలో టాక్సిన్స్ పెరిగిపోతాయి. కరివేపాకు తినడం వల్ల ఆ టాక్సిన్స్ అన్నీ కూడా దూరం అవుతాయి. కరివేపాకులో ఎన్నో పోషకాలు ఉన్నాయి. బీటా కెరోటిన్ వంటి ప్రోటీన్స్ జుట్టు సమస్యల్ని దూరం చేస్తాయి. హెయిర్ ఫోలికల్స్ ని బలంగా చేస్తాయి. దీనిని తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యంగా మార్చి ఒత్తుగా, పొడుగ్గా పెరిగేలా చేస్తుందని చెబుతున్నారు..

# మెరిసిపోయే చర్మం కావాలా.. అయితే ఈ ఆయిల్‌ను ట్రై చేయండి!

నువ్వుల నూనెతో మసాజ్ చేయడం వల్ల శరీరానికి బలం చేకూరుతుందని, చర్మం మెరిసిపోయి ముడతలు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చలికాలంలో బాడీ మసాజ్ చాలా ముఖ్యం. మసాజ్ చేయడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. కండరాలు బలపడతాయి. బాడీ మసాజ్ కోసం చాలా నూనెలు అందుబాటులో ఉన్నాయి. కానీ నువ్వుల నూనె చాలా ప్రయోజనకరమైనదని పలువురు నిపుణులు చెబుతున్నారు. చాలా ఇళ్లలో నువ్వుల నూనెను వంటకు ఉపయోగిస్తారు. మీరు చలికాలంలో నువ్వుల నూనెతో మసాజ్ చేస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. నువ్వుల నూనెతో మసాజ్ చేయడం వల్ల ఎలాంటి లాభాలు కలుగుతాయో తెలుసుకుందాం. నువ్వుల నూనెతో మసాజ్ చేయడం వల్ల శరీరానికి బలం చేకూరుతుందని, చర్మం మెరిసిపోయి ముడతలు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.



నువ్వుల నూనెతో మసాజ్ చేయడానికి ముందు నూనెను ఎండలో లేదా వేడి చేయాలని సూచిస్తున్నారు. ప్రతిరోజూ నువ్వుల నూనెతో మసాజ్ చేస్తే కండరాలు బలపడతాయి. కండరాలు బలంగా మారినప్పుడు శరీరంలో నొప్పి తగ్గుతుంది. మీ శరీరంలోని ఏదైనా భాగంలో నొప్పి ఉంటే మీరు నువ్వుల నూనెను ఉపయోగించవచ్చు. ఎండలో కూర్చొని నువ్వుల నూనెతో మసాజ్ చేసుకోవడం వల్ల మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. నువ్వుల నూనెతో మసాజ్ చేయడం వల్ల ఆందోళన, ఒత్తిడి రెండూ తగ్గుతాయి. నువ్వుల నూనెలో టైరోసిన్ అనే పోషకం ఉంటుంది. ఇది మెదడులో సెరోటోనిన్ హార్మోన్‌ను పెంచుతుంది. ఇది మీ మానసిక స్థితిని చక్కగా ఉంచుతుంది. మీరు సంతోషంగా ఉంటారు. ఆందోళన, ఒత్తిడికి దూరంగా ఉండాలనుకుంటే శీతాకాలంలో ప్రతిరోజూ నువ్వుల నూనెతో మసాజ్ చేయండి.

పెరుగుతున్న వయస్సుతో మన ఎముకలు బలహీనంగా మారడం ప్రారంభిస్తాయి. దీనికి ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఇలాంటి పరిస్థితుల్లో మీరు చలికాలంలో నువ్వుల నూనెతో శరీరమంతా మసాజ్ చేసుకుంటే ఎముకలు దృఢంగా ఉంటాయి. మీరు కీళ్ల నొప్పులకు కూడా దూరంగా ఉండవచ్చు. మీకు కావాలంటే వైద్యుడిని సంప్రదించిన తర్వాత కాల్షియం ఔషధాన్ని కూడా తీసుకోవచ్చు. ఇది మీకు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది.

# తీవ్రమైన మానసిక ఒత్తిడి వేధిస్తోందా!



మానసిక ఒత్తిడికి గురవుతున్న వ్యక్తులు ఆఫీసు, ఆర్థిక, కుటుంబ సమస్యలు మరిచిపోయి ఇష్టమైన వారితో సమయం గడపాలని మానసిక వైద్యులు చెబుతున్నారు. తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్న సమయంలో పనికి బ్రేక్ తీసుకుని ఏదైనా నచ్చిన ప్రదేశానికి వెళ్లాలని సూచిస్తున్నారు. ఆధునిక ప్రపంచంలో మానసిక ఒత్తిడి అనేది అతిపెద్ద సమస్యగా మారింది. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఒత్తిడికి గురవుతున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా అతిగా ఆలోచిస్తూ ఆందోళనకు గురవుతున్నారు. మారిన జీవన పరిస్థితులూ అందుకు తోడయ్యాయి. నేటి సమాజంలో ఉద్యోగం చేసే వారు తీవ్రమైన పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. అలాగే ఆర్థిక, కుటుంబ సమస్యలు వంటివి తీవ్ర ఆందోళనకు గురి చేసి అది కాస్త మానసిక ఒత్తిడికి దారి తీస్తోంది. దీంతో బీపీ, గుండెపోటు సహా ఇతర అనారోగ్యాల బారిన పడుతున్నారు. అయితే మెరుగైన జీవనశైలితో మందులు లేకుండా మానసిక ఒత్తిడిని ఎలా తగ్గించుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.. మానసిక ఒత్తిడికి గురవుతున్న వ్యక్తులు ఆఫీసు, ఆర్థిక, కుటుంబ సమస్యలు మరిచిపోయి ఇష్టమైన వారితో సమయం గడపాలని మానసిక వైద్యులు చెబుతున్నారు. తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్న సమయంలో పనికి బ్రేక్ తీసుకుని ఏదైనా నచ్చిన ప్రదేశానికి వెళ్లాలని సూచిస్తున్నారు. ఇష్టమైన పనులు చేయడం, మంచి సంగీతం వినడం, స్నేహితులు, కుటుంబంతో గడపడం వంటి పనులు ఈ సమస్య నుంచి బయటపడేందుకు ఉపయోగపడతాయని చెబుతున్నారు. మంచి ఆహార నియమాలు పాటిస్తే మానసిక ఒత్తిడి నుంచి బయటపడే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యను న్యాచురల్‌గా తగ్గించుకోవడమే ఉత్తమమనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా మనస్సును ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని చెబుతున్నారు. ఇదే విషయాన్ని అనేక పరిశోధనలు నిరూపించాయని వెల్లడిస్తున్నారు. కొన్ని రకాల ఆహారాలు ఆందోళన, ఒత్తిడి తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని సూచిస్తున్నారు.

అలాగే ప్రతి రోజూ ఉదయం యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి, ఆందోళన నుంచి బయటపడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. యోగా, ధ్యానం వల్ల ఆందోళన తగ్గి ఒత్తిడిని నియంత్రించుకోవచ్చని చెబుతున్నారు. మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్న వారు మంచి డైట్‌తోపాటు రోజూ కనీసం అరగంటపాటు యోగా, ధ్యానం చేస్తే మంచి ఫలితం ఉంటుందని అంటున్నారు. యోగా, ధ్యానంతోపాటు ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా మానసిక ఒత్తిడికి చెక్ పెట్టొచ్చని వైద్యులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా చేసే వ్యాయామంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని, అందులో ముఖ్యంగా ఒత్తిడికి గురవుతున్న వారు దీన్ని నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయని సూచిస్తున్నారు. క్రమబద్ధమైన జీవన శైలి సైతం మానసిక ఒత్తిడికి పరిష్కారం చూపించగలదని నిపుణులు చెబుతున్నారు. రోజూ మంచి ఆహారం తింటూ కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలపాటు నిద్రపోవాలని సూచిస్తున్నారు. నిద్రలేమితో బాధపడుతున్న వారిలో మానసిక ఆందోళన పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. సమయానికి అన్ని పనులు చేయడం, అతిగా ఆలోచించకపోవడం, ప్రతి చిన్న విషయానికీ ఆందోళనకు గురికాకుండా చూసుకోవడం ద్వారా ఒత్తిడి అనే సమస్యను జయించవచ్చని చెబుతున్నారు. లేదంటే తీవ్రమైన మానసిక ఒత్తిడి కాస్త డిప్రెషన్‌గా మారి అనేక ప్రమాదాలు తెచ్చిపెడుతుందని హెచ్చరిస్తున్నారు.

# బాబోయ్.. మళ్లీ పుంజుకున్న గోల్డ్, సిల్వర్ రేట్లు

## బిజినెస్

### రిలయన్స్ చేతికి కర్కినోస్ హెల్త్‌కేర్

**న్యూఢిల్లీ:** రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్).. టెక్నాలజీ ఆధారిత హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ కర్కినోస్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను రూ.375 కోట్లకు కొనుగోలు చేసింది. అనుబంధ సంస్థ రిలయన్స్ స్ట్రాటజిక్ బిజినెస్ వెంచర్స్ (ఆర్ఎసబీవీఎల్) ద్వారా ఈ కొనుగోలు చేపట్టినట్లు ఆర్ఐఎల్ తెలిపింది. 2020 జూలై 24న ఏర్పాటైన కర్కినోస్.. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించటం, డయాగ్నోసిస్, చికిత్స వంటి సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 60కి పైగా హాస్పిటల్స్‌తో ఒప్పందాలను కలిగి ఉంది.




### టాప్-10 సంస్థల్లో ఆరింటి ఎం-క్యాప్ రూ.86,848 కోట్ల వృద్ధి..
### రిలయన్స్, హెచ్డీఎఫ్సీ బ్యాంకులకు భారీ లబ్ధి..!

గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లలో టాప్-10 సంస్థల్లో ఆరు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.86,847.88 కోట్లు పెరిగింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీగా లబ్ధి పొందాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్-30 గతవారం 657.48 పాయింట్లు, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 225.9 పాయింట్ల లాభంతో ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఐటీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ లాభ పడ్డాయి. మరోవైపు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నష్టపోయాయి. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20,235.95 కోట్లు పుంజుకుని రూ.13,74,945.30 కోట్ల వద్ద స్థిర పడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం-క్యాప్ రూ.20,230.9 కోట్ల లాభంతో రూ.16,52,235.07 కోట్ల వద్ద ముగిసింది. ఐటీసీ ఎం-క్యాప్ రూ.17,933.49 కోట్ల లబ్ధితో రూ.5,99,185.81 కోట్ల వద్ద నిలిచింది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.15,254.01 కోట్ల లాభంతో రూ.9,22,703.05 కోట్ల వద్ద ముగిసింది. భారతీ ఎయిర్ టెల్ ఎం-క్యాప్ రూ.11,948.24 కోట్లు పెరిగి రూ.9,10,735.22 కోట్లకు చేరుకుంది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎం-క్యాప్ రూ.1,245.29 కోట్లు పుంజుకుని రూ.5,49,863.10 కోట్లకు చేరుకుంది. మరోవైపు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11,557.39 కోట్ల నష్టంతో రూ.7,13,567.99 కోట్లకు చేరుకుంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8,412.24 కోట్లు కోల్పోయి రూ.5,61,406.80 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.2,283.75 కోట్ల పతనంతో రూ.7,95,803.15 కోట్ల వద్ద ముగిసింది. టీసీఎస్ ఎం-క్యాప్ రూ.36.18 కోట్ల నష్టంతో రూ.15,08,000.79 కోట్ల వద్ద స్థిర పడింది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్-10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), ఐటీసీ, ఎల్ఐసీ, హిందూస్థాన్ యూనీ లివర్ నిలిచాయి.




ఇంకో రెండు రోజుల్లో ఈ ఏడాది పూర్తి కానుంది. ఇదే సమయంలో బంగారం వెండి ధరలు పెరుగుతూ, తగ్గుతున్నాయి. ఈ క్రమంలో నిన్న తగ్గిన ఈ ధరలు నేడు మళ్లీ పుంజుకున్నాయి. దీంతో ఈరోజు (డిసెంబర్ 29న) ఉదయం 6.20 గంటల నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 240 పెరిగి రూ. 76,740కి చేరింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 70,098కి చేరింది. మరోవైపు హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 76,720కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ. 70,327కు చేరింది. ఇక వెండి ధర విషయానికి వస్తే కిలో వెండి రూ. 1260 తగ్గి రూ. 88,600 స్థాయికి చేరుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు (10 గ్రాములకు) (24 క్యారెట్స్, 22 క్యారెట్స్)
ముంబైలో రూ. 76,600, రూ. 70,217
ఢిల్లీలో రూ. 76,740, రూ. 70,098
హైదరాబాద్‌లో రూ. 76,720, రూ. 70,327
విజయవాడలో రూ. 76,720, రూ. 70,327
కోల్‌కతాలో రూ. 76,500, రూ. 70,125
చెన్నైలో రూ. 76,820, రూ. 70,418
బెంగళూరులో రూ. 76,660, రూ. 70,272

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కిలోకు)
చెన్నైలో రూ. 89,010
ఢిల్లీలో రూ. 88,600
ముంబైలో రూ. 88,750
కోల్‌కతాలో రూ. 88,640
హైదరాబాద్‌లో రూ. 88,890
విశాఖపట్నంలో రూ. 88,890
బెంగళూరులో రూ. 88,820



బంగారం స్వచ్ఛత తెలుసుకోవడం ఎలాగో తెలుసా..
బంగారం స్వచ్ఛతను గుర్తించడానికి %×ూ% (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ద్వారా హాల్ మార్క్ ఇస్తారు. 24 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 999, 23 క్యారెట్‌లపై 958, 22 క్యారెట్‌పై 916, 21 క్యారెట్‌పై 875, 18 క్యారెట్‌పై 750 అని ఉంటుంది. ఎక్కువగా బంగారాన్ని 22 క్యారెట్లలో విక్రయిస్తుండగా, కొందరు 18 క్యారెట్లను కూడా ఉపయోగిస్తారు. క్యారెట్ 24కి మించదు, క్యారెట్ ఎక్కువైతే బంగారం స్వచ్ఛంగా ఉంటుంది. 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది.

గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడూ మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే ముందు మళ్లీ రేట్లు తెలుసుకోవాలని సూచన. వీటిలో GST, TCS వంటి ఇతర ఛార్జీలు కలిగి ఉండవు.

# ప్రైవేట్ బ్యాంకుల్లో అట్రిక్షన్లు ఎక్కువే

అట్రిక్షన్లు అనే పదం ఇప్పటి వరకూ ఐటీ, టెక్నాలజీ కంపెనీల్లోనే ఉండేది. ఒక కంపెనీలో పని చేస్తున్న వృత్తి నిపుణుల్లో పలువురు మెరుగైన వేతన ప్యాకేజీ కోసం ఇతర కంపెనీల్లోకి బదిలీ అవుతున్నారు. ఇప్పుడు ఇదే పరిస్థితి బ్యాంకులను తాకింది. ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగులు 25 శాతం అట్రిక్షన్లు కొనసాగుతున్నాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల బ్యాంకుల నిర్వహణకు ముప్పు పొంచి ఉందని '2023-24లో భారతీయ బ్యాంకుల్లో ప్రగతి- ధోరణులు' అనే అంశంపై ఆర్బీఐ నివేదిక పేర్కొంది. సెలెక్టెడ్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు (ఎస్ఎఫ్‌బీస్)ల్లో ఉద్యోగుల అట్రిక్షన్లు అధికంగా ఉంటాయని తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగుల సంఖ్య ఎక్కువ అని వెల్లడించింది. కానీ, గత మూడేండ్లలో ప్రైవేట్ బ్యాంకుల్లో అట్రిక్షన్ రేటు దాదాపు 25 శాతం ఉందని వివరించింది. ఉద్యోగుల అధిక అట్రిక్షన్ల వల్ల ఆయా బ్యాంకుల నిర్వహణకు ముప్పు ఏర్పడుతుందని ఆర్బీఐ పేర్కొంది. కస్టమర్ సర్వీసుల్లో అంతరాయం, లాస్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషనల్ నాలెడ్జ్, ఉద్యోగుల నియామక ఖర్చుల పెరుగుదల వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించింది. ఉద్యోగుల అట్రిక్షన్లను తగ్గించాలని ఆయా బ్యాంకులతో జరిగిన చర్చల్లో వెల్లడించామని, తప్పనిసరి వ్యూహాలను కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. బంగారం, జ్యువెల్లరీలపై రుణాలు, టాపప్ రుణాల మంజూరులో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆర్బీఐ పేర్కొంది. బంగారం రుణాల మంజూరీ విధానాన్ని సమగ్రంగా సమీక్షించుకోవాలని, నిర్దిష్ట కాల వ్యవధిలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. బంగారం రుణాల మంజూరు విషయంలో ఔట్ సోర్సింగ్ సేవలు, థర్డ్ పార్టీ సర్వీస్ ప్రొవైడర్ల వినియోగంపై తగినంత నియంత్రణ ఉండాలని సూచించింది.




# డబ్ల్యూటీసీ ఫైనల్‌కి చేరిన దక్షిణాఫ్రికా
## మరి భారత్ సంగతేంటి?

## స్పోర్ట్స్

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ మూడవ ఎడిషన్ ఫైనల్ రేసు ఉత్కఠగా సాగింది. ఈ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ టిక్కెట్ కోసం మూడు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. తాజాగా దక్షిణాఫ్రికా జట్టు ఫైనల్ రేసులో దూసుకెళ్లింది. దక్షిణాఫ్రికా తొలి టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను 2 వికెట్ల తేడాతో ఓడించి %ఔజ% ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. థెంబా బావుమా నేతృత్వంలోని జట్టు పాకిస్థాన్‌పై ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో కేవలం 2 వికెట్ల తేడాతో విజయం సాధించి తొలిసారి టైటిల్ మ్యాచ్‌కు టిక్కెట్‌ను బుక్ చేసుకుంది. సెంచూరియన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగో రోజు, కగిసో రబడ, మార్కో జాన్సన్ 9వ వికెట్‌కు అజేయంగా 51 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో దక్షిణాఫ్రికా ఓడిపోయే మ్యాచ్‌లో విజయం సాధించింది. గెలిచిన మ్యాచ్‌లో ఓడిపోయిన పాకిస్థాన్ సిరీస్‌ను కోల్పోయింది. రెండు జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరుగుతోంది. ఈ సిరీస్‌లో ఒకే ఒక్క మ్యాచ్ గెలిచినా, ఆఫ్రికా జట్టు %ఔజ% ఫైనల్స్‌కు చేరుతుంది. అందుకు తగ్గట్టుగానే తొలి టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను ఓడించిన దక్షిణాఫ్రికా జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు చేరుకోవడంలో సఫలమైంది. రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్‌ను 237 పరుగులకు ఆలౌట్ చేసిన దక్షిణాఫ్రికాకు 148 పరుగుల విజయ లక్ష్యం ఉంది. లక్ష్యం చిన్నదే కావడంతో దక్షిణాఫ్రికా సులభంగా గెలుస్తుందని అందరూ భావించారు.కానీ పాకిస్థాన్ పేసర్లు అబ్బాస్, ఖుర్రం షాజాద్ 19 పరుగులకే 3 వికెట్లు పడగొట్టి ఆఫ్రికాకు ఆరంభంలోనే షాక్ ఇచ్చారు. అయితే ఇక్కడి నుంచి జట్టు ఇన్నింగ్స్‌ను చేజిక్కించుకున్న ఐడెన్ మార్క్రామ్, కెప్టెన్ తెంబా బావుమా నెమ్మదిగా జట్టును విజయతీరాలకు చేర్చారు. నాలుగో రోజు ఈ జోడీ 27 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. కానీ ఈసారి అటాక్ చేసిన మహ్మద్ అబ్బాస్ మార్క్రమ్ వికెట్ తీశాడు. దీని తర్వాత కూడా కెప్టెన్‌గా ఆడిన తెంబా బావుమా జట్టును 96 పరుగులకు చేర్చాడు. దక్షిణాఫ్రికా విజయానికి 52 పరుగులు చేయాల్సి ఉంది. జట్టు వద్ద ఇంకా 6 వికెట్లు ఉన్నాయి. అయితే ఇక్కడ కెప్టెన్ బావుమా చేసిన తప్పిదంతో జట్టు ఇన్నింగ్స్ తడబడింది. అబ్బాస్ బంతిపై అనవసరంగా భారీ షాట్‌కు వెళ్లి బావుమా వికెట్‌ను కోల్పోయాడు. దురదృష్టవశాత్తు ఆ దశలో బావుమా నాటౌట్‌గా లేరు. కానీ అంపైర్ ఇచ్చిన నిర్ణయాన్ని సమీక్షించకుండా బావుమా పెద్ద తప్పు చేశాడు. ఎందుకంటే రివ్యూలో బంతి అతని బ్యాట్‌కు బదులుగా బావుమా తొడ ప్యాడ్‌కు తగిలిందని స్పష్టమైంది. ఇక్కడి నుంచి అబ్బాస్ ధాటికి దక్షిణాఫ్రికా తర్వాతి 11 బంతుల్లో 3 వికెట్లు కోల్పోయింది. వరుస బంతుల్లో డేవిడ్ బెడింగ్‌హామ్, కార్బిన్ బోష్‌లను అవుట్ చేయడం ద్వారా అబ్బాస్ మొదటిసారిగా ఒక టెస్టులో 6 వికెట్లు తీశాడు.





దీంతో దక్షిణాఫ్రికా కేవలం 99 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. అయితే ఇక్కడి నుంచి మార్కో జాన్సన్-కగిసో రబడ చిరస్మరణీయ భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు చారిత్రాత్మక విజయాన్ని అందించారు. వీరిద్దరూ అబ్బాస్ సహా పాక్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొని జట్టును విజయానికి చేరువ చేశారు. విజయం చేరువయ్యాక రబడ గేర్ మార్చి బౌండరీల వర్షం కురిపించాడు. అమెర్ జమాల్ ఒకే ఓవర్లో 11 పరుగులు చేశాడు. ఆపై యానాస్ అబ్బాస్ బంతిని బౌండరీ కొట్టి జట్టుకు విజయాన్ని అందించాడు. రబడ 26 బంతుల్లో 31 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, జాన్సన్ 16 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇది ఇలా ఉంటే టీమిండియా 55.88 విజయ శాతంతో 3వ స్థానంలో ఉండగా ఆసీస్ 58.89 విజయ శాతంతో రెండో ప్లేస్‌లో ఉంది. టీమిండియా %దీ+ు% ట్రోఫీని గెలిస్తేనే ఫైనల్‌కి వెళు_ంది.

### బుమ్రా మాయాజాలం.. ఆసీస్ ఆరో వికెట్ డౌన్





మెల్‌బోర్న్: బాక్సింగ్ డే టెస్టుపై భారత్ పట్టుబిగిస్తున్నది. లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ అద్భుత పోరాటంతో టీమ్‌ఇండియా పోటీలోకి వచ్చింది. నాలుగోరోజు ఆట ప్రారంభమైన కొద్దిసేపటికే భారత్ ఆలౌట్ అయింది. 9 పరుగులు మాత్రమే జోడించిన సెంచరీ హీరో నితీశ్ రెడ్డి (114) లియోన్ బౌలింగ్‌లో స్టార్క్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో ఆస్ట్రేలియాకు 120 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్సింగ్స్ ప్రారంభించిన ఆసీస్ బ్యాటర్లకు టీమ్‌ఇండియా పేసర్లు చుక్కలు చూపించారు. ఏ దశలోను కుదురుకోనియకుండా క్రమంతప్రకుండా వికెట్లు పడగొడుతున్నారు. దీంతో ఆతిథ్య జట్టు 85 రన్స్‌కే 5 వికెట్లు కోల్పోయింది. బుమ్రా వేసిన 6 ఓవర్‌లో ఆసీస్ ఓపెనర్ కొన్‌స్టాస్ (8) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో ప్రారంభమైన వికెట్ల పతనాన్ని సిరాజ్ కొనసాగించాడు. 43 పరుగుల వద్ద ఉస్మాన్ ఖవాజా వికెట్ పడగొట్టాడు. ఇద్దరు సీమర్లు పోటాపోటీగా వికెట్లు పడగొట్టడంతో 93 రన్స్‌కే 6 వికెట్లు కోల్పోయింది. బుమ్రా 4 వికెట్లు తీయగా, సిరాజ్ ఇద్దరిని ఔట్ చేశాడు. ఆస్ట్రేలియా ప్రస్తుతం 192 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది.



# అలా పిలవకండి.. పవన్ అభిమానులకు 'ఓజీ' టీమ్ రిక్వెస్ట్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రీసెంట్‌గా తన అభిమానుల మీద అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లోని కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుని శనివారం పవన్ కళ్యాణ్ పరమర్శించిన విషయం తెలిసిందే. అనంతరం మీడియాతో మాట్లాడుతుండగా.. అతని అభిమానులు ఓజీ.. ఓజీ.. ఓజీ.. సీఎం.. సీఎం అని పిలవడం మొదలుపెట్టారు. దీంతో అసహనానికి గురైన పవన్ కళ్యాన్.. అభిమానులను ఉద్దేశించి.. మీకు ఎక్కడ ఏం స్లోగన్ ఇవ్వాలో కూడా తెలియకపోతే ఎలా అయ్యా.. పక్కకి వెళ్లండి అంటూ అసహ్యించుకున్నాడు. దీంతో ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ విషయంపై తాజాగా ఓజీ టీం స్పందిస్తూ.. అభిమానులు ఓజీ అని పవన్‌ని పిలవద్దంటూ రిక్వెస్ట్ చేసింది. ఓజీ సినిమాపై మీరు చూపిస్తున్న అభిమానం, ప్రేమ మా అదృష్టంగా భావిస్తున్నాము. ఓజీ సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి నిరంతరం పని చేస్తున్నాం. కానీ మీరు పవన్ కళ్యాణ్ గారు పొలిటికల్ సభలకు వెళ్లినప్పుడు, సమయం, సందర్భం చూడకుండా ఓజీ.. ఓజీ అని అరవడం, వారిని ఇబ్బంది పెట్టడం సరైంది కాదు. వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎంత కష్టపడుతున్నారో మనందరికీ తెలుసు. ఆ స్థానాన్ని, స్థాయిని గౌరవించడం మన కనీస బాధ్యత. అందుకని ఇంకొన్ని రోజులు ఓపికగా ఉందాం. 2025 ఓజీ పండుగ వైభవంగా నిలుస్తుందని మేము గట్టిగా నమ్ముతున్నాం అంటూ డీవీవీ ఎంటర్‌టైనమెంట్స్ రాసుకోచ్చింది.




## రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చిన దిల్ రాజు

మెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం వచ్చేసింది. 'గేమ్ ఛేంజర్ ట్రైలర్ ఎప్పుడు వస్తుందా అని వెయిట్ చేస్తున్న మెగా ఫ్యాన్స్‌కు నిర్మాత దిల్ రాజు గుడ్ న్యూస్ చెప్పాడు. ఈ మూవీ ట్రైలర్‌ను న్యూ ఇయర్ కానుకగా.. జనవరి 01న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా బృందావన కాలనీలోని వజ్రా మైదానంలో 256 అడుగుల రామ్‌చరణ్ భారీ కటౌట్ ఏర్పాటు చేశారు అభిమానులు. అయితే ఈ కటౌట్ లాంఛ్ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చాడు దిల్ రాజు. ఈ సందర్భంగానే మూవీ ట్రైలర్ జనవరి 01న రాబోతుంది వెయిట్ చేయండి అంటూ చెప్పుకోచ్చాడు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియార అద్వానీ కథానాయికగా నటిస్తుండగా.. సునీల్, ఎస్ జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. సూపర్ రెస్పాన్స్‌తో దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రైలర్ కోసం వెయిట్ చేస్తున్నారు అభిమానులు.

# అనిల్‌రావిపూడి-చిరంజీవి సినిమా జోనర్ ఇదే..



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవికి సంబంధించిన ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ స్టార్ యాక్టర్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. తాజాగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేయబోతున్న సినిమాపై ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. ఈ ఇద్దరు ఎలాంటి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారంటూ ఇండస్ట్రీ సర్కిల్‌లో జోరుగా చర్చ నడుస్తుంది. కాగా నిర్మాత సాహు గారపాటి ఆ సస్పెన్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. సినిమాలో ఎలాంటి సందేశం ఉండదు. యాక్షన్ ఎలిమెంట్స్‌తో సాగే అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ ఇది. మేమంతా చిరంజీవి సినిమాలు, ఆయన ట్రేడ్ మార్క్ ఎలిమెంట్స్ చూస్తూ ఎదిగినవాళ్లం. అనిల్ రావిపూడి స్టైల్‌లో మెగాస్టార్‌ను చూడబోతున్నామన్నాడు. అనిల్ రావిపూడి ఫ్లేవర్ కామెడీతో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా ఉండబోతుందని స్పష్టం చేశారు. ఇప్పుడీ కామెంట్స్‌తో చిరంజీవి నుంచి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ సినిమా రాబోతుందని అర్థమవుతోంది. చిరంజీవి ప్రస్తుతం విశ్వంభర, శ్రీకాంత్ ఓదెల సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఇవి పూర్తి కాగానే అనిల్ రావిపూడి సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లబోతున్నాడట. కాగా అనిల్ రావిపూడి ప్రస్తుతం వెంకటేశ్ హీరోగా సంక్రాంతికి వస్తున్నాం చేస్తున్నాడు. ఈ మూవీ సంక్రాంతి కానుకగా 2025 జనవరి 14న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది.




# కిరణ్ అబ్బవరం 'దిల్ రుబా' టీజర్‌కి ముహూర్తం ఫిక్స్

'క' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న యువ నటుడు కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. ఇప్పటికే క సినిమాకి సీక్వెల్ తీసే పనిలో ఉన్న కిరణ్ మరో సినిమాను విడుదలకు సిద్ధం చేశాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రుబా' ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి టీజర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ మూవీ టీజర్‌ను న్యూ ఇయర్ కానుకగా.. జనవరి 03న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. మరోవైపు ఈ సినిమాను ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com